https://prajapratibha.com

RNI : APTEL 2013/54721

# ప్రజా ప్రతిభ

ప్రతి అక్షరం ✍ ప్రజా పక్షం

తెలుగు దినపత్రిక

సంపుటి: 13 | సంచిక: 258 | prajapratibha.2013@gmail.com | ఎడిటర్ : దానూరి శ్రీనివాస్ | 9441500341 | వెల: రూ.5.00 | పేజీలు: 10

ఆంధ్రప్రదేశ్ Published from Andhra pradesh & Telangana బుధవారం । 27 । మే । 2026




**శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే**

ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి

2 లో..



## నేటి నుంచి టిడిపి మహానాడు

- వర్చువల్ విధానంలో రెండ్రోజుల పండగ
- పార్టీ నేతలతో చర్చించిన అధినేత చంద్రబాబు

**అమరావతి,మే26(ప్రజా ప్రతిభ):** టీడీపీ మహానాడు 2026 రెండ్రోజుల పాటు జరుగనుంది. బుధ, గురువారాల్లో ఈసారి పూర్తిగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. దీనిని వివిధ మాధ్యమాల ద్వారా ప్రసారం చేస్తారు.

మిగతా 2లో..



## హైబ్రిడ్ విధానంలో మహానాడు

- టీడీపీ సెంట్రల్ ఆఫీస్‌లో ఈనెల 27,28 తేదీల్లో మహానాడు నిర్వహణ
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు

**మంగళగిరి, (ప్రజా ప్రతిభ):** తెలుగుదేశం పార్టీకి, ఆ పార్టీ కార్యకర్తలకు అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం మహానాడని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న

మిగతా 2లో..

## మా బిడ్డకు న్యాయం ఎప్పుడు..?

- జగన్ ఎదుట కన్నీరుమున్నీరైన సుగాలి ప్రీతి తల్లిదండ్రులు
- 'మా బిడ్డ కేసును మరచిపోయారు' అంటూ ఆవేదన.. అండగా ఉంటామని జగన్ భరోసా
- 'మా బిడ్డకు న్యాయం చేయండి' అంటూ జగన్‌ను వేడుకున్న తల్లిదండ్రులు
- తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్న న్యాయం కోసం పోరాటం
- కేసును పక్కన పెట్టేశారని బాధిత కుటుంబం ఆరోపణ
- లీగల్ సపోర్ట్ అందిస్తామని జగన్ హామీ
- సుగాలి ప్రీతి కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందని భరోసా



**తాడేపల్లి, మే 26 (ప్రజా ప్రతిభ):** కర్నూలు జిల్లాలో సంచలనం సృష్టించిన సుగాలి ప్రీతి అత్యాచారం, హత్య కేసులో న్యాయం కోసం పోరాడుతున్న ఆమె తల్లిదండ్రులు మరోసారి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. గత తొమ్మిదేళ్లుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్న పార్వతి, రాజు నాయక్‌లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసి తమ గోడును వినిపించారు.

మిగతా 2లో..

# రైతుల నుంచి నేరుగా ప్రజలకు ఉత్పత్తులు

- రాష్ట్రంలో ఫార్మ్ టు హోమ్ విధానం
- వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పైకొత్త వ్యూహం
- దేవరపల్లి మండలం యడవోలు వద్ద కోకో సిటీ
- జూలైలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన
- పులివెందులలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ పూర్తికి నిధుల మంజూరు
- కొత్త ఆక్వా కనెక్షన్లకూ విద్యుత్ సబ్సిడీ వర్తింపు
- మత్స్యకారులకు 200 మెకనైజ్డ్ బోట్ల కొనుగోలుకు ఆమోదం
- వ్యవసాయ అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**అమరావతి, మే 26 (ప్రజా ప్రతిభ):** రైతులు పండించిన ఉత్పత్తులు నేరుగా వినియోగదారుల ఇళ్లకు చేర్చేలా ఫార్మ్ టూ హోమ్ విధానం అమలు చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రత్యేకించి కూరగాయలు, పండ్ల ఉత్పత్తులు నేరుగా వినియోగదారుకు చేర్చేలా ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సహా తక్కువ వ్యయంతో ఇంటి వద్దకే చేరేలా ఈ కొత్త వ్యూహం ఉపయోగపడుతుందని అన్నారు.

క్యాంపు కార్యాలయంలో మంగళవారం వ్యవసాయం, ఇతర అనుబంధ శాఖలు, ప్రాథమిక రంగంలో 6 మిషన్లపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈసారి రాష్ట్రంపై ఎల్ నినో చూపుతున్న ప్రభావాలను అంచనా వేస్తూ ప్రాంతాల వారీగా పంటల సాగు అంచనా జరగాలని, దానికి అనుగుణంగానే చర్యలు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాల్లో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పీఎండీఎస్- హాఫ్ మూన్ విధానాల్లో సేద్యం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్ నినో కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావం ఉన్నప్పటికీ రాష్ట్రంలోని రైతులు నష్ట పోకుండా పంటలకు కనీస మద్దతు ధర లభించేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ విషయంలో కేంద్ర సహకారం కూడా తీసుకుని ఏపీలో చేపడుతున్న ప్రకృతి సేద్యానికి మరింత ప్రోత్సాహం కల్పించాలని సీఎం స్పష్టం చేశారు.

ఇప్పటికే ఈ సాగుతో విజయవంతమైన రైతుల సేవల్ని కూడా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. కరవు ప్రాంతాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వేర్వేరు చోట్ల పశువుల దాణా పండించేలా చూడాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణతో పాటు ఆధునీకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేసి ఏ పంటకు భూములు అనువుగా ఉన్నాయన్నది రైతులకు తెలియచేయాలన్నారు.

భూసార పరీక్షలు చేసి వాటి వివరాలను రైతులు పొందేలా ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రకృతి సేద్యం సహా ఎన్ఎంఎన్ఎఫ్ పథకం అమలు కోసం కేంద్రానికి లేఖలు రాయాలని సీఎం నిర్దేశించారు. రైతు బజార్లు, ప్రైవేటు మార్కెట్లలో ప్రకృతి సేద్యం

మిగతా 2లో..



## చొరబాటు దారులూ పారిపోండి

- వెళ్లగొట్టక ముందే పారిపోతే మంచిది
- జైల్లో పెట్టి తిండి పెట్టేది లేదు
- బంగ్లాదేశ్ వలసదారులకు సీఎం సువేందు హెచ్చరిక
- సరిహద్దుల వద్దకు చేరుకుంటున్న అక్రమ వలసదారులు

**కోల్‌కతా,మే26(ప్రజా ప్రతిభ):** పశ్చిమబెంగాల్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ అక్రమవలస దారులపై చర్యలను సువేందు అధికారి ప్రభుత్వం ముమ్మరం చేసింది. అక్రమ వలస దారులను వారి స్వదేశానికి పంపేందుకు చర్యలు

మిగతా 2లో..



## కర్నాటకంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి

- డికెకు పగ్గాలు అప్పగించేందుకు రంగం సిద్ధం
- సిద్ధరామయ్యను రాజ్యసభకు పంపే యత్నం?

**న్యూఢిల్లీ,మే26(ప్రజా ప్రతిభ):** కర్ణాటకలో నాయకత్వ పోరుకు తెర పడనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాల సమాచారం. సిఎం మార్పు లేదని బయటకు

మిగతా 2లో..




## వాహనదారులపై మళ్లీ పిడుగు

- సిఎన్‌జి ధరలు పెంచిన కేంద్రం
- వరుసగా నాలుగోసారి పెరిగిన ధరలు

**న్యూఢిల్లీ,మే26(ప్రజా ప్రతిభ):** కేంద్రం మళ్లీ షాకిచ్చింది. సీఎన్‌జీ ధరలను మరోసారి

మిగతా 2లో..

# పుణ్యం మాట దేవుడెరుగు.. రోగాలు మాత్రం గ్యారంటీ

- గోదావరి కాలుష్యంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆగ్రహం
- పుష్కరాల ముందు నదీ జలాలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు
- ఆంధ్ర పేపర్ మిల్స్ వ్యర్థాల విడుదల ప్రాంతాన్ని బోటులో వెళ్లి పరిశీలించిన పవన్





**రాజమండ్రి, మే 26 (ప్రజా ప్రతిభ):** గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రెండో రోజు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి నదీ కాలుష్య పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. వెంకటనగరం సమీపంలో ఉన్న ఆంధ్ర పేపర్ మిల్స్ నుంచి పారిశ్రామిక వ్యర్థాలు గోదావరిలో కలిసే ప్రాంతానికి బోటులో వెళ్లిన ఆయన, అక్కడి పరిస్థితులను నిశితంగా పరిశీలించారు. అధికారులతో కలిసి నీటి నమూనాలను సేకరింపజేసి కాలుష్య స్థాయిపై వివరాలు తెలుసుకున్నారు.

ఈ పర్యటనలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, సంబంధిత శాఖల అధికారులు పవన్ వెంట ఉన్నారు. కాలుష్య పరిస్థితిని ప్రత్యక్షంగా చూసిన పవన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "పవిత్ర గోదావరిలో పారిశ్రామిక వ్యర్థాలు కలవడం అత్యంత దురదృష్టకరం. పుష్కరాల సమయంలో

మిగతా 2లో..



- "ఏపీ పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు రాలేదు"
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై చర్యలు కోరిన ప్రొఫెసర్ నాగేశ్వర్

## నోటీసులపై నాగేశ్వర్ క్లారిటీ.. దుష్ప్రచారంపై డీజీపీకి ఫిర్యాదు


**అమరావతి, మే 26 (ప్రజా ప్రతిభ):** ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ మంగళవారం సి.వి. ఆనంద్ను కలిసి తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన నాగేశ్వర్, తనకు ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ నుంచి ఇప్పటివరకు ఎలాంటి నోటీసులు అందలేదని స్పష్టం చేశారు.

ఇటీవల ఒక టీవీ చర్చా కార్యక్రమంలో పవన్ కల్యాణ్, అమిత్ షా, వైఎస్ జగన్ మోహన్ రెడ్డిలకు

మిగతా 2లో..

## ఈ లోకంలో లేని తండ్రి, తాతపై విమర్శలా..?

- టీడీపీపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఫైర్



**అమరావతి, మే 26 (ప్రజా ప్రతిభ):** చాలా రోజుల తర్వాత ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలుగుదేశం పార్టీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రాజారెడ్డిపై టీడీపీ నేతలు చేస్తున్న విమర్శలను తీవ్రంగా తప్పుబట్టిన ఆమె.. దివంగత నేతలను లక్ష్యంగా చేసుకుని రాజకీయాలు చేయడం నీచమని మండిపడ్డారు. "నాన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి, తాత రాజారెడ్డి ఈ లోకంలో లేరు. సంజాయిషీ ఇచ్చుకోలేని వారిపై దుష్ప్రచారం చేయడం రాజకీయ అక్కసుకు నిదర్శనం" అని షర్మిల వ్యాఖ్యానించారు. నిజంగా వారు అంత దుర్మార్గులే అయితే తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడే ఎందుకు విచారణ జరపలేదని ప్రశ్నించారు. ఇప్పుడు కూడా

మిగతా 2లో..

## డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల రుణాలు

- పూచీకత్తు లేకుండానే కేంద్రం భారీ అవకాశం
- లక్షలాది మహిళలకు ఆర్థిక బలం
- ఏపీ బీజేపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీయన్ మాధవ్



**అమరావతి, మే 26 (ప్రజా ప్రతిభ):** డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబనకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని ఏపీ బీజేపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీయన్ మాధవ్ తెలిపారు. "దీన్ దయాళ్

మిగతా 2లో..

https://prajapratibha.com
RNI : APTEL 2013/54721
ప్రజా ప్రతిభ
ప్రతి అక్షరం ప్రజా పక్షం
తెలుగు దినపత్రిక



## నోటీసులపై నాగేశ్వర్ క్లారిటీ..

# దుష్ప్రచారంపై డీజీపీకి ఫిర్యాదు

**మొదటిపేజీ తరువాయి..**

సంబంధించి తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారిన విషయాన్ని నాగేశ్వర్ గుర్తు చేశారు. ఆ వ్యాఖ్యలను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ వ్యవహారంపై జనసేన నాయకుల ఫిర్యాదుల మేరకు కాకినాడ, మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో తనపై ఎఫ్ఐఆర్‌లు నమోదైనప్పటికీ, అరెస్టు కోసం ఏపీ పోలీసులు హైదరాబాద్‌కు వచ్చారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు.

సోషల్ మీడియాలో తనపై కావాలనే తప్పుడు వార్తలు, వదంతులు వ్యాప్తి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ డీజీపీని కోరినట్లు నాగేశ్వర్ తెలిపారు. ఇప్పటికే ఈ అంశంపై ఏపీ ప్రభుత్వం కూడా స్పష్టత ఇచ్చిందని, తాజాగా నాగేశ్వర్ చేసిన ప్రకటనతో నోటీసులు, అరెస్టు ప్రచారాలకు తెరపడినట్లయిందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల రుణాలు

**మొదటిపేజీ తరువాయి..**

అంత్యోదయ యోజన" (డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం) పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు ఎలాంటి పూచీకత్తు లేకుండానే గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు అందించే అవకాశం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. పట్టణ, గ్రామీణ పేదలకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ మహిళల ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే ఈ పథకం లక్ష్యమన్నారు. పేదరిక నిర్మూలన, స్వావలంబన బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయమిదని పేర్కొన్నారు.

రాష్ట్రంలో సుమారు 90 లక్షలకుపైగా మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని, వీరిలో కనీసం 10 లక్షల మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందినా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోకి రూ.1 లక్ష కోట్లకుపైగా ఆర్థిక ప్రవాహం వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ రుణాల ద్వారా గ్రామీణ మహిళలు చిన్న వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు, పాడి పరిశ్రమ, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు వంటి రంగాల్లో మరింత ముందుకు వెళ్లగలరని తెలిపారు. మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రాధాన్యత ఇస్తోందని, డ్వాక్రా మహిళల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మాధవ్ స్పష్టం చేశారు.

## ఈ లోకంలో లేని తండ్రి, తాతపై విమర్శలా..?

**మొదటిపేజీ తరువాయి..**

కూటమి ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తవుతున్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే దివంగత నేతలను లాగుతున్నారని ఆరోపించిన ఆమె.. "పగబట్టి తప్పుడు ప్రచారం చేసినంత మాత్రాన మీరు ఉత్తములు కాలేరు" అని వ్యాఖ్యానించారు. ప్రజలకు చెప్పుకోదగ్గ విజయాలు లేకపోవడంతోనే ఈ తరహా ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు. రాజారెడ్డి సేవలను ప్రస్తావిస్తూ.. కడప జిల్లాలో 1973లోనే 70 పడకల ఆసుపత్రి నిర్మించి ఉచిత వైద్యం అందించారని గుర్తుచేశారు. పేద విద్యార్థుల కోసం డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేశారని తెలిపారు. "ఎంతో మంది పేదల జీవితాలను నిలబెట్టిన వ్యక్తి చరిత్రను వక్రీకరించడం రాయలసీమ ప్రజలు హర్షించరు" అన్నారు.

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సంక్షేమ, అభివృద్ధికి చిరునామా అని పేర్కొన్న షర్మిల.. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి పథకాలు ఆయన పాలనలోనే అమలయ్యాయని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టులో ఐదేళ్లలో 33 శాతం పనులు పూర్తి చేశారని, తర్వాత రెండు సార్లు అధికారంలో ఉన్న చంద్రబాబు మిగిలిన పనులు పూర్తి చేయలేకపోయారని ఆరోపించారు. "బురద జల్లాలని చూసినంత మాత్రాన సూర్యుడి కాంతి తగ్గదు. మహానేత వైఎస్‌ను చిన్నచేయలేరు" అని వ్యాఖ్యానించిన షర్మిల.. ప్రజల గుండెల్లో ఆయనకు ఉన్న స్థానం ఎవరూ చెరపలేరన్నారు. ఇకనైనా ఆరోపణల రాజకీయాలు మానేసి ప్రజలకు మేలు చేసే పనులపై దృష్టి పెట్టాలని చంద్రబాబు ప్రభుత్వానికి సూచించారు.

## రైతుల నుంచి నేరుగా ప్రజలకు ఉత్పత్తులు

**మొదటిపేజీ తరువాయి..**

ద్వారా పండిన ఉత్పత్తులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

### అరటికి కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం

కృష్ణా, గోదావరి డెల్టా సహా వివిధ ప్రాంతాల్లో పంటలకు సాగునీటిపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. పంట తెగుళ్లను నియంత్రించేలా పురుగుమందుల వినియోగం ఏమేరకు రాష్ట్రంలో తగ్గించగలిగామో అంచనా వేయాలని సీఎం స్పష్టం చేశారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి మైక్రో న్యూట్రియంట్లను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. యుద్ధ ప్రభావం నేపథ్యంలో రసాయన ఎరువుల లభ్యత పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని.. ఈ నేపథ్యంలో ప్రకృతి సేద్యం వైపుగా రైతుల్ని ప్రోత్సహించాలన్నారు.

నేచరల్ ఫార్మింగ్ పై వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, విద్యార్థులు కూడా క్షేత్రస్థాయికి వెళ్లి అధ్యయనం చేసేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అధికారులకు సీఎం నిర్దేశించారు. వ్యవసాయ యాంత్రీకరణ పై క్లస్టర్ల వారీగా ప్రణాళికలు చేపట్టటంతో పాటు రైతు సాధికార సంస్థ ద్వారా హార్వెస్టర్లు, విత్తన యంత్రాలు, ఇతర పరికరాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫార్మర్ యాప్ ద్వారా అన్ని అంశాలనూ ఇంటిగ్రేట్ చేయాలని డ్రోన్లు, ఫార్మింగ్ యంత్రాల వినియోగం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మార్చేందుకు రూ.40 వేల కోట్లతో పూర్వోదయ పథకం అమలులో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల కనెక్టివిటీ, గోదాములు సహా మౌలిక సదుపాయాల నిర్మాణంతో పాటు రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులతో అభివృద్ధి చేయనున్నట్టు సీఎం వివరించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరాపల్లి సమీపంలో యడవోలు వద్ద కోకో సిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు.

జూలై నాటికి మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేయనున్నట్టు సీఎం వెల్లడించారు. పశు దాణాతో పాటు సైలేజ్ ను తక్కువ వ్యయానికే అందుబాటులోకి తేవటంతో పాటు తీవ్ర ఉష్ణోగ్రత కారణంగా పౌల్ట్రీలో కోళ్లు చనిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమలో అరటికి కోల్డ్ స్టోరేజి సౌకర్యం కల్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

### బ్లూ ఎకానమీగా ఆక్వారంగం ఆభివృద్ధి

పులివెందులలో సెంట్రల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి అవసరమైన రూ.3 కోట్లను తక్షణమే విడుదల చేసి కార్యకలాపాలు ప్రారంభించాలని సీఎం నిర్దేశించారు. ఆక్వా జోన్లలో ఆక్వా సాగు చేసే రైతులకు ఇచ్చే విద్యుత్ సబ్సీడీ అంశంపైనా ముఖ్యమంత్రి కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆక్వా రంగానికి యూనిట్‌కు రూ.1.50 చొప్పున విద్యుత్ విద్యుత్ సబ్సీడి ఇస్తున్నామని అన్నారు.

ఇప్పటికే ఇచ్చిన 50 వేల కనెక్షన్లతో పాటు కొత్తగా రిజిస్ట్రేషన్లు చేసుకున్న 12,680 ఆక్వా కనెక్షన్లకూ ఈ సబ్సిడీ వర్తింప చేయాలని ఆదేశించారు. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,100 కోట్లు ఇస్తోందని తెలిపారు. కొత్తగా ఇచ్చే కనెక్షన్లకు కూడా రూ.188 కోట్ల అదనపు సబ్సిడీని ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. రాష్ట్రంలో సాగవుతున్న 4 లక్షల ఎకరాలు ఆక్వా జోన్ పరిధిలోకి రావాలని సీఎం స్పష్టం చేశారు. ఆక్వా రంగంలో క్వాలిటీ సర్టిఫికేషన్‌తో పాటు ట్రేసబిలిటీ తీసుకురావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్లోనూ చేపల పెంపకం ద్వారా స్థానిక మత్స్యకారుల ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. అలాగే సముద్ర తీరంలో మత్స్యకారులకు 200 మెకనైజ్డ్ బోట్లను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు.

దీని కోసం రూ.240 కోట్ల మేర వ్యయం అవుతుందని అధికారులు సీఎంకు వివరించారు. బ్లూ ఎకానమీ దిశగా ఆక్వా రంగాన్ని ప్రోత్సహిస్తామని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతు బజార్లను ఆధునికంగా మార్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్, పశు సంవర్ధక శాఖల అధికారులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు హాజరయ్యారు.

# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

### ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్,మే26 (ప్రజా ప్రతిభ):** అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలని ట్రంప్ రాసుకొచ్చారు. తన



వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టాగంట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.

# పుణ్యం మాట దేవుడెరుగు.. రోగాలు మాత్రం గ్యారంటీ

**మొదటిపేజీ తరువాయి..**

ఈ నీటిలో స్నానం చేస్తే పుణ్యం మాట దేవుడెరుగు... రోగాలు మాత్రం కచ్చితంగా వస్తాయి" అంటూ ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.



గతంలో ఏలూరులో కలుషిత తాగునీటి కారణంగా జరిగిన ఘటనలను గుర్తు చేసిన పవన్, రాష్ట్ర అభివృద్ధికి పరిశ్రమలు ఎంత అవసరమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. పరిశ్రమల అభివృద్ధి పేరుతో ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే పరిస్థితులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు.

గోదావరి కాలుష్య సమస్యపై త్వరలోనే అసెంబ్లీతో పాటు కేబినెట్ సమావేశాల్లో కూడా చర్చిస్తామని పవన్ వెల్లడించారు.

పుష్కరాల రేవులను అందంగా తీర్చిదిద్దడమే కాకుండా, భక్తులు సురక్షితంగా స్నానం చేసేలా నదీ జలాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

మంత్రి కందుల దుర్గేష్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, పుష్కరాల నిర్వహణలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేపర్ మిల్స్ నుంచి వెలువడుతున్న వ్యర్థాలపై ప్రభుత్వం ఇప్పటికే నిఘా ఉంచిందని, సంబంధిత అధికారులతో నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నామని పవన్ తెలిపారు. పుష్కరాల వేళ గోదావరి జలాల స్వచ్ఛతపై



ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, కాలుష్య కారకులపై కఠిన చర్యలకు సిద్ధమవుతున్న సంకేతాలు ఈ పర్యటన ద్వారా స్పష్టమయ్యాయి.

# మా బిడ్డకు న్యాయం ఎప్పుడు..?

**మొదటిపేజీ తరువాయి..**

2017లో తమ కుమార్తెపై అత్యంత దారుణంగా అత్యాచారం చేసి హత్య చేశారని, కానీ ఇన్నేళ్లు గడిచినా నిందితులకు తగిన శిక్ష పడకపోవడంతో పాటు కేసు ముందుకు కదలడం లేదని వారు వాపోయారు. "మా బిడ్డకు న్యాయం ఎప్పుడు జరుగుతుంది..?" అంటూ జగన్ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు.

గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తమ కుటుంబానికి ఇంటి స్థలం, వ్యవసాయ భూమి, ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అండగా నిలిచిందని గుర్తు చేసిన వారు, ప్రస్తుతం తమ సమస్యలను పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన పెన్షన్‌ను కూడా అధికారులు నిలిపివేశారని, ఇంటి నిర్మాణానికి సహాయం కోరినా స్పందన లేదని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా కేసు విచారణను వేగవంతం చేసి, సీబీఐ దర్యాప్తు ముందుకు సాగేలా న్యాయ సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబం గోడును ఓపికగా విన్న జగన్, సుగాలి ప్రీతి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ తరపున న్యాయ సహాయం అందించడంతో పాటు న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని భరోసా కల్పించారు.

## హైబ్రిడ్ విధానంలో మహానాడు

**మొదటిపేజీ తరువాయి..**

తెలుగుజాతి మొత్తం "మేముసైతం.. తెలుగుదేశం కోసం" అని నినదించే అరుదైన వేదిక మహానాడని ఆయన అన్నారు. దేశమంతా ఔరా అనిపించేలా హైబ్రిడ్ విధానంలో మహానాడును నిర్వహిస్తూ డిజిటల్ విప్లవానికి నాంది పలుకుతున్నామని తెలిపారు.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ప్రతి ఏడాది మహానాడును నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఈ కార్యక్రమం పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణ, రాష్ట్ర అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు కీలక వేదికగా నిలుస్తోందన్నారు. పశ్చిమాసియా యుద్ధాల నేపథ్యంలో దేశ ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన పిలుపును గౌరవిస్తూ ముందుగా నెల్లూరులో మూడు రోజుల పాటు నిర్వహించాలని భావించిన మహానాడును డిజిటల్ వేదికగా హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పార్టీ ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు.

ఈసారి మహానాడును రాష్ట్రవ్యాప్తంగా 1,848 క్లస్టర్లలో నిర్వహించనున్నట్లు చెప్పారు. అమరావతిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పరిమిత సంఖ్యలో అగ్రనేతలు పాల్గొనగా.. నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తామని తెలిపారు. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కార్యకర్తలతో నేరుగా మాట్లాడేలా ప్రత్యేక సాంకేతిక ఏర్పాట్లు చేశామని వెల్లడించారు.

హైబ్రిడ్ విధానంతో వేలాదిమంది కాకుండా లక్షలాది మంది కార్యకర్తలు మహానాడుతో అనుసంధానమయ్యే అవకాశం కలుగుతుందని తెలిపారు. క్లస్టర్ విధానం ద్వారా క్షేత్రస్థాయిలో భవిష్యత్ నాయకత్వాన్ని గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. టెక్నాలజీ సహాయంతో ప్రతి కార్యకర్తను పార్టీ కేంద్ర వ్యవస్థతో అనుసంధానించే వినూత్న ప్రయత్నమిదని వివరించారు.

ఈసారి మహానాడులో "స్త్రీశక్తి" ప్రధాన అంశంగా నిలవనుందని చెప్పారు. మహిళా సంక్షేమం కోసం పార్టీ చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధి చర్యలు, సాధికారత అంశాలపై ప్రధాన చర్చలు జరగనున్నాయని తెలిపారు. మహిళల పాత్రను మరింత బలోపేతం చేసే తీర్మానాలు కూడా మహానాడులో తీసుకురానున్నట్లు వెల్లడించారు.

ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహానాడు కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించడం, "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీతంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రతి క్లస్టర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

మహానాడులో మొత్తం 20 తీర్మానాలపై చర్చలు జరుగుతాయని, సుమారు 65 మంది వక్తలు ప్రసంగిస్తారని తెలిపారు. ఆరోగ్యకరమైన సోషల్ మీడియా వినియోగం, యువత పాత్ర, డిజిటల్ రాజకీయాలపై కూడా చర్చలు జరుగుతాయని చెప్పారు. "కాక్రోచ్ జనతా పార్టీ" వంటి సోషల్ మీడియా ట్రెండింగ్ అంశాలపై కూడా చర్చ ఉండొచ్చని వ్యాఖ్యానించారు. హైబ్రిడ్ మహానాడు ద్వారా ఆదా అయ్యే నిధులను పార్టీ అభివృద్ధికి వినియోగించనున్నట్లు తెలిపారు. టెక్నికల్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, గత 10 రోజులుగా పార్టీ కేంద్ర కార్యాలయం నుంచే అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.

తెలుగుజాతి గర్వించే "పసుపు పండుగ"కు రాష్ట్రవ్యాప్తంగా సర్వం సిద్ధమైందని, ఈ మహానాడును విజయవంతం చేయాలని పార్టీ కుటుంబ సభ్యులందరికీ పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

## నేటి నుంచి టిడిపి మహానాడు

**మొదటిపేజీ తరువాయి..**

ఈ విషయాన్ని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు, గ్రామ స్థాయి కార్యకర్తలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహానాడు నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశర చేశారు. తెలుగువారు ఆసక్తిగా ఎదురు చూసే కార్యక్రమం మహానాడు అని, పార్టీకి అది ఒక భావోద్వేగమని సీఎం చంద్రబాబు అన్నారు. మహానాడు ద్వారా పార్టీ ప్రజలకు ఏ సందేశం ఇస్తుందో అన్న ఆసక్తి అందరిలో ఉంటుందని చెప్పారు. గతంలో కోవిడ్ సమయంలో కూడా డిజిటల్ పద్ధతిలో మహానాడు నిర్వహించామని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరోసారి వర్చువల్ విధానాన్నే ఎంచుకున్నామని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున వర్చువల్ రూపంలో మహానాడు నిర్వహించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1845 క్లస్టర్ల పరిధిలో మహానాడు నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీ ఎదుగుదలకు, కార్యకర్తలు నాయకులుగా ఎదగడానికి క్లస్టర్ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. ఈసారి 'స్త్రీశక్తి' థీమ్‌తో మహానాడు నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయిలో జరిగే మహానాడులో రాష్ట్ర స్థాయి నాయకులు కూడా పాల్గొంటారని సీఎం చంద్రబాబు తెలిపారు. మహానాడులో సరైన మార్గనిర్దేశర చేసుకుని వాటిని అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరిలో జవాబుదారీతనం ఉండాలని.. అప్పుడే ప్రజలు విశ్వసిస్తారని అన్నారు.

## చొరబాటు దారులూ పారిపోండి

**మొదటిపేజీ తరువాయి..**

తీసుకుంటోంది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగానే బెంగాల్‌లోని అక్రమవలసదారుల పై సువేందు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. బంగ్లాదేశీయులను వారి స్వదేశానికి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో సీఎం బెంగాల్ సీఎం సువేందు అధికారి చొరబాటుదారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. బెంగాల్ నుంచి వెళ్లగొట్టకముందే పారిపోవాలని సూచించారు. బంగ్లా ప్రజలు స్వచ్ఛందంగా వెళ్లకపోతే.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతమున్న విదేశీయుల చట్టానికి లోబడే తాము ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 'ప్రభుత్వం చర్యలు తీసుకోకముందే పారిపోండి' అంటూ ముఖ్యమంత్రి తాజాగా హెచ్చరించారు. బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల అంశంపై మాట్లాడుతూ, కొత్త చట్టంతో కాకుండా ప్రస్తుతం ఉన్న విదేశీయుల చట్టం కిందే ఈ చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణం అక్రమవలసదారులు ఈ ప్రదేశాన్ని వదిలివెళ్లాల్సిందేనని అన్నారు. తమ పౌరులను వెనక్కి తీసుకునే బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించ డానికి సిద్ధంగా ఉన్నట్టు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని తెలిపారు. బంగ్లా అక్రమ చొరబాటుదారులను జైళ్లకు పంపవద్దని తాను పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. 'వారికి మనమెందుకు ఆతిథ్యం ఇవ్వాలని దేశ వనరులను మనం ఎందుకు దుర్వినియోగం చేయాలి. చొరబాటుదారులు ఏమైనా మన అల్లుళ్లా?' అని ప్రశ్నించారు. బంగ్లా పౌరులు స్వచ్ఛందంగా, శీఘ్రంగా వెళ్లకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, అక్రమ వలసదారులను వెనక్కి పంపించేందుకు బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు స్వదేశానికి తిరుగుముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకింపూర్ సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్దఎత్తున వారు గుమిగూడారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ సమయంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని.. వారిని తిరిగి తీసుకువెళ్లడం అక్కడి ప్రభుత్వ బాధ్యత అని సువేందు పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైల్లో పెట్టొద్దని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. వారికి ఆశ్రయమిచ్చి, తిండి పెట్టడానికి వారేమైనా మన బంధువులా అని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం 'గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి' అనే నినాదంతో విదేశీయులను దేశం నుంచి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే అక్రమంగా రాష్ట్రంలోకి చొరబడినట్లు గుర్తించిన వారికి, సరైన పత్రాలు లేని వారికి తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడానికి నిర్బంధ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. మాల్దాలో తొలి నిర్బంధ కేంద్రాన్ని ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## కర్నాటకంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి

**మొదటిపేజీ తరువాయి..**

చెబుతున్నా, డికె శివకుమార్‌కు పగ్గాలు అందించేందుకు కాంగ్రెస్ రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సిద్ధరామయ్య ప్రభుత్వం ఇటీవల మూడేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మరోసారి నాయకత్వ సమస్య తెరపైకి వచ్చింది. పార్టీ అధిష్టానం సిద్ధరామయ్య, డీకేలను న్యూఢిల్లీకి పిలవడంతో ఎట్టకేలకు సమస్య కొలిక్కి వచ్చినట్టు చెబుతున్నారు. ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు అధిష్టానం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు రాజ్యసభ సీటును ఆఫర్ చేసి కేంద్రంలో కీలక పాత్ర పోషించాల్సిందిగా కోరిందని తెలుస్తోంది. తగిన సమయం తీసుకుని నిర్ణయం చెప్పాల్సిందిగా ఆయనకు సూచించినట్టు చెబుతున్నారు. దీంతో సిద్ధరామయ్య రెండు, మూడు రోజుల్లో రాజీనామా చేసే అవకాశాలు న్నాయని అంటున్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికలపైనే ఢిల్లీ సమావేశంలో చర్చించినట్టు కాంగ్రెస్ అధిష్టానం చెబుతున్నప్పటికీ ఈ సమావేశంలో రాష్ట్రంలో నాయకత్వ మార్పిడిపై ప్రధానంగా చర్చ జరిగినట్టు చెబుతున్నారు. డీకే శివకుమార్‌కు అధికారాన్ని (సీఎం) బదిలీ చేసేందుకు అధిష్టానం ఏకగ్రీవంగా మద్దతు పలికిందని పార్టీ వర్గాలు తెలిపాయి.

సుమారు 6 గంటల సేపు జరిగిన ఈ సమావేశంలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌తో పాటు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, రణ్‌దీప్ సూర్జేవాలా పాల్గొన్నారు. కర్ణాటకలో జరిగిన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది. సీఎం పదవిని సిద్ధరామయ్య చేపట్టారు. అయితే డీకే శివకుమార్‌తో రెండున్నరేళ్లు చొప్పున పదవీకాలం పంచుకునేందుకు అప్పట్లో నిర్ణయం జరిగిందని ఆయన వర్గం చెబుతోంది. ఈ వాదనను సిద్ధరామయ్య తోసిపుచ్చారు. ఐదేళ్లూ తానే సీఎంగా ఉంటానని, అయితే అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమని తరచు చెబుతున్నారు.

## వాహనదారులపై మళ్లీ పిడుగు


**మొదటిపేజీ తరువాయి..**

పెంచింది. కిలో సీఎన్‌జీపై రూ.2 పెంచింది. పెరిగిన ధరలు మంగళవారం నుంచే అమలులోకి వచ్చాయి. తాజా పెంపుతో ఢిల్లీలో సీఎన్‌జీ ధర రూ.81.09 నుంచి రూ.83.09కి చేరింది. సీఎన్‌జీ ధరలను పెంచడం మే 15వ తేదీ నుంచి ఇది నాలుగోసారి కావడం గమనార్హం. మే 15వ తేదీన మొదట కిలోకు రూ.2 పెంచగా.. అనంతరం రెండుసార్లు ఒక్క రూపాయి చొప్పున కేంద్రం పెంచింది. తాజాగా మరో రూ.2 పెరగడంతో నాలుగోసారి సీఎన్‌జీ ధరలు పెరిగినట్లయ్యింది. గత 11 రోజుల్లో మొత్తం రూ.7 వరకు ధరలు పెరగడంతో వాహనదారులు, ఆటో, క్యాబ్, ట్రాన్స్‌పోర్ట్ రంగాలపై అదనపు భారం పడనుంది. ఎన్నికల ముందు ఇంధన ధరలు పెంచబోమని పదేపదే ప్రకటించిన కేంద్రం.. ఎన్నికలు ముగిశాక వరుసగా ధరలు పెంచుకుంటూ పోతున్నది. తాజాగా మరోసారి ఇంధన ధరలను పెంచింది. సోమవారం నాడు పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 2.61, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2.71 చొప్పున ధరలు పెరిగాయి. తాజా పెంపుతో మే 15 నుంచి లీటర్‌కు మొత్తం పెంపు రూ.7.5కు చేరింది. గడచిన 11 రోజుల్లో ఇంధన ధరలు పెరుగడం ఇది నాలుగోసారి. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 99.51 నుంచి రూ. 102.12 చేరుకోగా లీటర్ డీజిల్ ధర రూ. 92.49 నుంచి రూ. 95.20కి పెరిగింది.

## హామీలు ఇచ్చారు
# అమలు ఎక్కడ అంటూనాన్నా ప్రజలు..

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందూరు శ్రీనివాసరెడ్డి, మే 26, (ప్రజా ప్రతిభ):

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రశ్నలు మిన్నంటుతున్నాయి. అధికారంలోకి వస్తే సంక్షేమ పాలనకు కొత్త నిర్వచనం ఇస్తామని, ప్రతి కుటుంబానికి ప్రత్యక్ష లబ్ధి చేకూరేలా పలు పథకాలను అమలు చేస్తామని ప్రకటించిన హామీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.




ఎన్నికల సమయంలో ఎంతో ఆశగా ఎదురుచూసిన పథకాలపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడంతో ప్రజలు సమాధానాలు కోరుతున్న పరిస్థితి నెలకొంది. ఆరోగ్యశ్రీ సేవలను మరింత విస్తరించి పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని ప్రకటించిన హామీపై ఇప్పటికీ అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో ప్రజలు వైద్యసేవల కోసం తిరుగుతున్నారని, ప్రకటించిన విధంగా సేవలు అందుబాటులోకి రావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్య ఖర్చుల భారంతో సామాన్య కుటుంబాలు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఆరోగ్యశ్రీ అమలుపై స్పష్టత కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఉచిత ఇసుక సరఫరా హామీపై నిర్మాణ రంగం పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకుంది. నిర్మాణ రంగానికి ఊతమిస్తామని, సామాన్యులకు ఇల్లు నిర్మాణంలో ఉపశమనం కలిగిస్తామని ప్రకటించినా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇసుక కొరత, ధరల పెరుగుదలతో చిన్న నిర్మాణాలు నిలిచిపోతున్నాయని, కార్మికులకు ఉపాధి దెబ్బతింటోందని నిర్మాణ రంగ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉచిత వంటగ్యాస్ పథకం అమలుపైనా ప్రజల్లో చర్చ కొనసాగుతోంది. గ్యాస్ ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీ అమలైతే గృహిణులకు పెద్ద ఊరటనిస్తుందని భావించినా, ఇప్పటివరకు కార్యరూపం దాల్చకపోవడం నిరాశకు గురిచేస్తోందని మహిళలు చెబుతున్నారు. వంటగ్యాస్ ధరల భారంతో కుటుంబ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ఛార్జీల తగ్గింపుపై ఇచ్చిన హామీలపైనా ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ బిల్లులు పెరగడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నికల సమయంలో ప్రకటించిన ఉపశమన చర్యలు ఇంకా కనిపించకపోవడం నిరాశ కలిగిస్తోందని వినియోగదారులు అంటున్నారు. విద్యుత్ వినియోగ భారం తగ్గిస్తామని ప్రకటించిన మాటలు అమలులోకి రావాలని ప్రజలు కోరుతున్నారు. పెట్రోల్ ధరల నియంత్రణపై ఇచ్చిన హామీలు కూడా ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. పెరిగిన ఇంధన ధరల ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై పడుతోందని, దీని వల్ల సామాన్య జీవనం భారంగా మారుతోందని ప్రజలు చెబుతున్నారు. పెట్రోల్ ధరల నియంత్రణపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మత్స్యకారులకు భరోసా కల్పిస్తామని ప్రకటించిన పథకాల అమలుపైనా అసంతృప్తి వ్యక్తమవుతోంది. సముద్రతీర ప్రాంతాల్లో మత్స్యకారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి ప్రకటించిన ఆర్థిక సాయం ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. వారి జీవనోపాధికి భరోసా కల్పించే చర్యలు తక్షణమే తీసుకోవాలని కోరుతున్నారు. రైతాంగానికి ప్రకటించిన అన్నదాత సుఖీభవ వంటి పథకాలపై కూడా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాగు వ్యయాలు పెరుగుతున్న సమయంలో రైతులకు ప్రకటించిన ఆర్థిక చేయూత ఇంకా అందకపోవడం వల్ల వారు ఆందోళన చెందుతున్నారని చెబుతున్నారు. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు పెరిగిపోతున్న తరుణంలో ప్రభుత్వ సహాయం అత్యవసరమని రైతులు అభిప్రాయపడుతున్నారు. మహిళలకు నెలవారీ ఆర్థిక సాయం, 45 సంవత్సరాలు దాటిన మహిళలకు ప్రత్యేక నగదు సాయం వంటి హామీలు ఎన్నికల సమయంలో విస్తృత ప్రచారం పొందాయి. ఈ పథకాలపై మహిళలు ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ, ఇప్పటివరకు అమలుపై స్పష్టత లేకపోవడం నిరాశకు గురిచేస్తోందని చెబుతున్నారు. కుటుంబ ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ పథకాలు ఎంతో ఉపయోగపడతాయని భావిస్తున్న మహిళలు వాటి అమలుపై ఎదురుచూస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం బలోపేతం, విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలపైనా ప్రజలు సమాధానం కోరుతున్నారు. పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు అందించడంపై తీసుకుంటున్న చర్యలు స్పష్టంగా కనిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మొత్తంగా ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ ఆరు సహా పలు సంక్షేమ హామీలు క్షేత్రస్థాయిలో ఎప్పుడు అమలవుతాయన్నది ప్రస్తుతం ప్రజల్లో ప్రధాన చర్చగా మారింది. ఎన్నికల వేదికలపై ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ప్రకటించిన పథకాల అమలుకు ఖచ్చితమైన కాలపట్టిక ప్రకటించి, ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. హామీలు కేవలం ప్రచార సభలకే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే ప్రజా విశ్వాసానికి అసలైన ప్రమాణమని, హామీల అమలే ప్రభుత్వ పనితీరుకు కొలమానమని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రజల్లో వినిపిస్తున్న ప్రధాన ప్రశ్న ఒక్కటే. హామీలు ఎక్కడ. అమలు ఎప్పుడు.


# కార్యకర్తలే పార్టీకి అసలైన శక్తి..

## వారి మనసులు గెలుచుకున్న నాయకత్వమే శాశ్వతం..

## అలాంటి మనస్సున్న నాయకుడే అన్నా రాంబాబు..

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందూరు శ్రీనివాసరెడ్డి, మే 26, (ప్రజా ప్రతిభ):

రాజకీయ వ్యవస్థలో నాయకత్వం ఎంత ప్రధానమో, ఆ నాయకత్వాన్ని నిలబెట్టే కార్యకర్తల పాత్ర అంతకంటే గొప్పదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా కార్యకర్తల బలం లేకుండా ప్రజల్లో నిలబడలేదని, పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, ఎన్నికల సమయంలో విజయానికి బాటలు వేయడంలోనూ కార్యకర్తలే కీలక శక్తిగా నిలుస్తారని చెబుతున్నారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కార్యకర్తల అంకితభావం, నిబద్ధత, కష్టనష్టాలను లెక్కచేయని తపన ఎంతో కీలకమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పార్టీ కోసం తమ వ్యక్తిగత అవసరాలను పక్కనబెట్టి ఎండనకా, వాననకా ప్రజల్లో తిరుగుతూ నాయకత్వాన్ని ప్రజలకు చేరువ చేసే వారు కార్యకర్తలేనని గుర్తుచేస్తున్నారు. నాయకులు ప్రజల్లో గుర్తింపు పొందడం వెనుక కార్యకర్తల నిరంతర శ్రమ ఉంటుందని, అలాంటి కార్యకర్తల త్యాగాలను గుర్తించి వారిని ఆదరించే నాయకత్వమే ప్రజల్లో చిరస్థాయిగా నిలుస్తుందని చెబుతున్నారు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి పార్టీ అభ్యర్థిని ప్రజలకు పరిచయం చేయడం, సమస్యలను ప్రజల నుంచి సేకరించి నాయకత్వానికి చేరవేయడం, ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కార్యకర్తల ద్వారానే సాధ్యమవుతుందని అంటున్నారు. అలాంటి కార్యకర్తలను కేవలం రాజకీయ అవసరాల కోసమే కాకుండా కుటుంబ సభ్యుల్లా భావించి వారి యోగక్షేమాలు తెలుసుకునే నాయకులు అరుదుగా కనిపిస్తారని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. కార్యకర్తల కుటుంబ పరిస్థితులను తెలుసుకోవడం, వారి పిల్లల చదువులు, ఉపాధి అవకాశాలపై ఆరా తీయడం, కష్టసమయంలో వారికి చేయూతనివ్వడం వంటి అంశాలు నాయకత్వంపై కార్యకర్తల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొంటున్నారు. ఒక్కసారి పేరు పెట్టి ఆప్యాయంగా పలకరిస్తే కార్యకర్త జీవితాంతం ఆ అనుబంధాన్ని మరచిపోడని అంటున్నారు. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జ్ అన్నా రాంబాబు కార్యకర్తలతో మమేకమై ఉండే నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. రాజకీయ కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కాకుండా కార్యకర్తల వ్యక్తిగత జీవితాలపై సైతం శ్రద్ధ చూపిస్తూ, వారి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం ఆయన నాయకత్వంలో కనిపించే ప్రత్యేకతగా చెబుతున్నారు. కార్యకర్తల సమస్యలను ఓపికగా విని వాటి పరిష్కారానికి కృషి చేయడం వల్ల ఆయనపై కార్యకర్తల్లో విశేషమైన అభిమానం ఏర్పడిందని అంటున్నారు. కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలవడంలో అన్నా రాంబాబు ముందుంటారని పలువురు గుర్తుచేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు తోడ్పాటు అందించడం, వైద్య సహాయం అవసరమైన వారికి చేయూతనివ్వడం, చదువుల కోసం సహాయం చేయడం వంటి సందర్భాల్లో ఆయన స్పందించిన తీరు కార్యకర్తల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచిందని చెబుతున్నారు. రాజకీయాల్లో పదవులు తాత్కాలికమైనవే అయినా, కార్యకర్తల మనసుల్లో సంపాదించిన స్థానం శాశ్వతమని ఆయన నమ్ముతారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాజకీయాల్లో చాలా మంది నాయకులు, కార్యకర్తలను ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తు చేసుకుంటారని, కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వారి పరిస్థితులను పట్టించుకునే వారు చాలా కొద్దిమందేనని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో కార్యకర్తలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, వారి అభ్యున్నతిని కోరుకుంటూ ముందుకు సాగే నాయకత్వం ప్రత్యేకతను సంతరించుకుంటుందని




చెబుతున్నారు. కార్యకర్తలే పార్టీకి అసలైన ఆస్తి అన్న భావనతో వారిని ప్రోత్సహిస్తూ, వారికి ఆత్మవిశ్వాసం కలిగిస్తూ ముందుకు నడిపించడం నిజమైన నాయకత్వ లక్షణమని స్పష్టం చేస్తున్నారు. అన్నా రాంబాబు చూపుతున్న ఆప్యాయత, అందుబాటులో ఉండే స్వభావం, కార్యకర్తల పట్ల చూపుతున్న అనురాగం వల్ల పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొన్నదని అంటున్నారు. నాయకుడు, కార్యకర్తలను గౌరవిస్తే వారు రెట్టింపు ఉత్సాహంతో పార్టీ కోసం పనిచేస్తారని, అదే పార్టీ బలోపేతానికి పునాది అవుతుందని చెబుతున్నారు. కార్యకర్తల శ్రమను గుర్తించి వారిని ముందుకు తీసుకెళ్లే నాయకత్వమే భవిష్యత్తులో మరింత ప్రజాదరణ పొందుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే కార్యకర్తలను గుర్తించి, వారి సేవలకు విలువనిస్తూ, అవసరమైనప్పుడు అండగా నిలుస్తున్న గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జ్ అన్నా రాంబాబు పట్ల కార్యకర్తలు గర్వం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాల్లో నిజమైన బలం కార్యకర్తలేనని విశ్వసిస్తూ వారితో మమేకమై ముందుకు సాగుతున్న ఆయన నాయకత్వం కార్యకర్తల్లో విశేషమైన నమ్మకాన్ని కలిగిస్తోందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాజకీయాల్లో పదవులు, హోదాలు, అధికారాలు వచ్చి పోతుంటాయి. కానీ కార్యకర్తల మనసుల్లో స్థానం సంపాదించిన నాయకుడు మాత్రం ఎప్పటికీ నిలిచిపోతాడు. కార్యకర్తల కష్టాలను తనవిగా భావించి, వారి అభ్యున్నతికోసం కృషి చేసే నాయకత్వమే నిజమైన ప్రజానాయకత్వానికి నిదర్శనమని, అలాంటి నాయకత్వానికి అన్నా రాంబాబు ఉదాహరణగా నిలుస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.


# మృతుల కుటుంబాలను పరామర్శించిన అన్నా రాంబాబు

## నివాళులర్పించి ప్రగాఢ

## సంతాపం తెలిపిన అన్నా రాంబాబు..

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందూరు శ్రీనివాసరెడ్డి, మే 26, (ప్రజా ప్రతిభ):

మార్కాపురం జిల్లా, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జ్ అన్నా రాంబాబు మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న మరణవార్తలను తెలుసుకున్న వెంటనే ఆయా గ్రామాలకు చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల పార్థివదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబాలకు ధైర్యం చెప్పారు. గిద్దలూరు మండలం కె.ఎస్.పల్లె గ్రామంలో గిద్దలూరు నియోజకవర్గ మాజీ వైస్సార్సీపీ ఇంచార్జ్ ఐ.వి.రెడ్డి తండ్రి ఇల్లూరి పెద్ద పుల్లారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అన్నా రాంబాబు గ్రామానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. పెద్ద పుల్లారెడ్డి మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు కల్పించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా కొనకనమిట్ల మండలం నాగరాజుకుంట గ్రామానికి చేరుకుని కుడుముల ఓబుల్ రెడ్డి మృతికి నివాళులర్పించారు. మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఓబుల్ రెడ్డి మరణం గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ, జీవితంలో ప్రతి ఒక్కరూ మరణాన్ని తప్పించుకోలేరని, కానీ మనిషి చేసిన మంచిపనులు, సమాజానికి అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.



అన్నా రాంబాబు వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ వారు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఈ కష్టకాలంలో మనోధైర్యంతో ఉండాలని సూచించారు. అన్నా రాంబాబు మృతుల కుటుంబాలను స్వయంగా పరామర్శించి ఓదార్చడం పట్ల స్థానికులు అభినందనలు వ్యక్తం చేశారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతూ, ఇలాంటి విషాద సందర్భాల్లో కుటుంబాలకు అండగా నిలవడం ఆయన మానవీయతకు నిదర్శనమని పలువురు పేర్కొన్నారు.

# నిద్రలో ఉండగానే మెడలోని గొలుసు అపహరణ



మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 26, (ప్రజా ప్రతిభ):

మార్కాపురం మండలం బిరుదులనర్వ గ్రామంలో చోటుచేసుకున్న చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇంటి ముందు ఆరుబయట నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, రాత్రి వేళ తీవ్ర ఉక్కపోత కారణంగా మహిళ ఇంటి బయట నిద్రిస్తోంది. అదే సమయంలో గుర్తు తెలియని దుండగులు చాకచక్యంగా ఆమె మెడలో ఉన్న సుమారు మూడున్నర తులాల బంగారు గొలుసును అపహరించి పరారయ్యారు. ఉదయం నిద్రలేచిన అనంతరం మెడలో గొలుసు కనిపించకపోవడంతో బాధితురాలు కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. వెంటనే వారు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వెంటనే మార్కాపురం సీఐ అల్తాఫ్ హుస్సేన్, ఎస్సై వేమన్న సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఘటన జరిగిన తీరును పరిశీలించి, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఆరా తీశారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆనవాళ్లను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. గ్రామాల్లో రాత్రి వేళ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ ఘటనతో గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది.

# కటకం లావణ్య కుటుంబాన్ని పరామర్శించిన అన్నా రాంబాబు..



మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 26, (ప్రజా ప్రతిభ):

మార్కాపురం జిల్లా, గిద్దలూరు నియోజకవర్గంలోని కంభం పట్టణంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కటకం లావణ్య కుటుంబ సభ్యులను గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జ్ అన్నా రాంబాబు పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి వారి దుఃఖంలో భాగస్వామ్యం అయ్యారు. ఈ విషాద ఘటన పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కటకం లావణ్య అకాల మరణం బాధాకరమని అన్నా రాంబాబు పేర్కొన్నారు. చిన్న వయసులోనే మృతి చెందడం కుటుంబానికి తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, మనోధైర్యంతో ఈ క్లిష్ట సమయంలో నిలబడాలని సూచించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ, జీవితంలో ఇలాంటి విషాద ఘటనలు కుటుంబాలను తీవ్రంగా కలచివేస్తాయని అన్నారు. ఇలాంటి సమయంలో కుటుంబ సభ్యులు ఒకరికొకరు అండగా నిలవాలని చెప్పారు. లావణ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మృతురాలి కుటుంబ సభ్యులతో కొంతసేపు మాట్లాడిన అన్నా రాంబాబు, వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అవసరమైన ప్రతి విషయంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం ప్రతి నాయకుడి బాధ్యత అని అన్నారు. లావణ్య మృతి స్థానికంగా విషాదాన్ని నింపిందని, ఆమె కుటుంబానికి ఇది తీరని లోటని అన్నా రాంబాబు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ క్లిష్ట పరిస్థితిని అధిగమించే శక్తి కలగాలని ఆకాంక్షించారు. పరామర్శ కార్యక్రమంలో స్థానిక వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. మృతురాలికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అన్నా రాంబాబు కుటుంబ సభ్యులను ఓదార్చుతూ, ఇలాంటి క్లిష్ట సమయంలో పార్టీ శ్రేణులు అండగా ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. కటకం లావణ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ నివాళులు అర్పించారు.

# గాలి వానకు కూలిన ఇల్లు.. బాధిత దంపతులకు ఎరిక్షన్ బాబు చేయూత.

యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, మే 26,(ప్రజా ప్రతిభ).

ప్రకృతి విపత్తుతో గూడు కోల్పోయిన నిరుపేద దంపతులకు టీడీపీ నాయకుడు గూడూరి ఎరిక్షన్ బాబు అండగా నిలిచారు. యర్రగొండపాలెం పట్టణంలోని కొలుకుల రోడ్డులో నివాసముంటున్న బొడ్డు అంజిరెడ్డి, మంగమ్మ దంపతుల రేకుల ఇల్లు ఇటీవల కురిసిన గాలి వాన తీవ్రతకు పూర్తిగా కూలిపోయింది. దీంతో వారు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కూలిపోయిన ఇంటిని పరిశీలించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తక్షణ సహాయంగా నిత్యావసర సరుకులతో పాటు రూ.10 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ, “కష్టకాలంలో బాధిత కుటుంబానికి పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తాం. ప్రభుత్వం ద్వారా వారికి శాశ్వత నివాసం కల్పించేందుకు కృషి చేస్తాం” అని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, ఎంఆర్పో మంజునాథ్ రెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజా ప్రతిభ
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
AndhrapradeshDistricts
Praja Pratibha Telugu Daily
www.prajapratibha.in Prajapratibha.2013@gmail.com
బుధవారం
మే 27 2026

## భవన కార్మికుల ముసుగులో చోరీలు..

### చాకచక్యంగా కేసు ఛేదించిన పోలీసులు..



మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 26, (ప్రజా ప్రతిభ):

భవన నిర్మాణ కార్మికుల ముసుగులో గ్రామాల్లో సంచరిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అర్ధవీడు పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. పక్కా వ్యూహంతో కొద్ది రోజుల్లోనే కేసును ఛేదించి, భారీ మొత్తంలో బంగారం, నగదు స్వాధీనం చేసుకోవడంతో పోలీసుల పనితీరును మార్కాపురం జిల్లా పోలీసు అధికారులు అభినందించారు.మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలోని అర్ధవీడు మండలం గన్నేపల్లి గ్రామంలో ఈ నెల 10న జరిగిన చోరీ ఘటనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. బాధితుడు సురేష్ ఇంట్లో జరిగిన ఈ దొంగతనంలో విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు.గ్రామంలో ఇటీవల సంచరించిన అనుమానితుల వివరాలను సేకరించిన పోలీసులు, భవన నిర్మాణ పనుల పేరుతో గ్రామాల్లో తిరుగుతున్న వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టారు. సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారం ఆధారంగా పక్కా ప్రణాళికతో దర్యాప్తు కొనసాగించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.మంగళవారం కంభం సర్కిల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కాపురం ఉప పోలీసు అధికారి నాగరాజు కేసు వివరాలను వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి 120 గ్రాముల బంగారు ఆభరణాలు, 50 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. భవన కార్మికులుగా నటిస్తూ గ్రామాల్లో ఇళ్ల పరిస్థితులను గమనించి, అవకాశమొచ్చినప్పుడు చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు.చోరీ జరిగిన కొద్ది రోజుల్లోనే కేసును ఛేదించి నిందితులను పట్టుకున్న అర్ధవీడు పోలీసుల చాకచక్యాన్ని ఉప పోలీసు అధికారి ప్రశంసించారు.దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి నగదు బహుమతులు అందజేసి అభినందించారు.ప్రజలు అపరిచితులను పనుల పేరుతో ఇంటి వద్దకు అనుమతించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.గ్రామాల్లో అప్రమత్తత పెంచితే ఇటువంటి ఘటనలను అరికట్టవచ్చని పేర్కొన్నారు.

## బావోజీపేట కబడ్డీ టోర్నమెంట్ కు కంబాల లక్ష రూపాయలు విరాళం



గోకవరం మే26 (ప్రజా ప్రతిభ న్యూస్)

గోకవరం మండలం బావోజీ పేట గ్రామంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న, కబడ్డీ టోర్నమెంట్ కు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు లక్ష రూపాయలు విరాళం అందించారు. ఇటీవలే బావోజీ పేట హనుమాన్ యూత్ సభ్యులు, కంబాల శ్రీనివాసరావుని కలిసి, కబడ్డీ టోర్నమెంట్ సహకారం అందించాలని కోరారు. స్పందించిన ఆయన లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. ప్రస్తుతం ఆయన అమెరికాలో ఉండటంతో ఆ నగదును వారికి అందించాలని రామసేన సభ్యులు, బీజేపీ నాయకులను ఆదేశించారు. ఆయన ఆదేశాల ప్రకారం గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద లక్ష రూపాయలు నగదును బావోజీ పేట గ్రామ పెద్దలు, కబడ్డీ యూత్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు కంబాల శ్రీనివాసరావుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు పెద్దాడ వెంకన్న దొర, అంబటి శ్రీను, గ్రామస్తులు జీ. రామకృష్ణ, బుల్లబ్బాయి, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ చేయూత

### రేవుపోలవరం యువతకు క్రీడా సామాగ్రి పంపిణీ

ఎస్ రాయవరం, మే 26, (ప్రజా ప్రతిభ) :

ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం గ్రామంలో మంగళవారం ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడా సామాగ్రి పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ట్రస్ట్ వ్యవస్థాపకులు బంగారు చిట్టి చేతుల మీదుగా గ్రామ యువ క్రీడాకారులకు వాలీబాల్, నెట్, ఫుట్‌బాల్, త్రోబాల్ తదితర క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బంగారు చిట్టి మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. “క్రీడలు మానసిక ఉల్లాసాన్నే కాకుండా శారీరక దృఢత్వాన్ని కూడా పెంపొందిస్తాయి. గ్రామీణ యువత మంచి క్రీడాకారులుగా ఎదిగి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి” అని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన సామాగ్రిని అందించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గనగళ్ళ శ్రీను, అర్జిల్లి రాజు తదితరులతో పాటు స్థానిక క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఒంగోలులో ఎస్ఐఆర్ అవగాహన, శిక్షణ సదస్సు

## పార్టీ బలోపేతానికి బీఎల్‌ఏలకు సమగ్ర దిశానిర్దేశం..



ప్రకాశం జిల్లా బ్యూరో / కుందూరు శ్రీనివాసరెడ్డి, మే 26, (ప్రజా ప్రతిభ):

ఒంగోలులో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన, శిక్షణ సదస్సు వైస్సార్సీపీ శ్రేణుల్లో విశేష ఉత్సాహాన్ని నింపింది.పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్టంగా తీర్చిదిద్దడం, బూత్ స్థాయి నిర్మాణాన్ని క్రమబద్ధీకరించడం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించే విధానాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా నిర్వహించిన ఈ సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి బాధ్యులు, బూత్ స్థాయి ప్రతినిధులు హాజరయ్యారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన విధానాలపై సుదీర్ఘంగా చర్చించడంతో పాటు, ముఖ్యంగా బీఎల్‌ఏల పాత్రపై ప్రత్యేక శిక్షణ అందించారు.సదస్సులో నాయకులు మాట్లాడుతూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పార్టీ శ్రేణులు మరింత అప్రమత్తంగా, సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం ద్వారా మాత్రమే పార్టీ పట్ల విశ్వాసం పెంపొందుతుందని, ప్రతి కార్యకర్త ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కేవలం రాజకీయ కార్యక్రమాలకు పరిమితం కాకుండా, ప్రజల దైనందిన సమస్యలపై స్పందించే శక్తివంతమైన వ్యవస్థను నిర్మించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ద్వారా పార్టీ నిర్మాణాన్ని మరింత శాస్త్రీయంగా, క్రమబద్ధంగా తీర్చిదిద్దే అవకాశాలు ఉన్నాయని వివరించారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ప్రతి స్థాయిలో స్పష్టమైన బాధ్యతలు అప్పగించడం, సమస్యలను సకాలంలో గుర్తించడం, వాటిని ఉన్నత నాయకత్వానికి చేరవేయడం, పరిష్కార దిశగా వేగంగా స్పందించడం వంటి అంశాలను ఈ విధానం ద్వారా సమర్థవంతంగా అమలు చేయవచ్చని తెలిపారు. ప్రత్యేకంగా బూత్ స్థాయి ప్రతినిధులైన బీఎల్‌ఏల పాత్రపై సుదీర్ఘంగా అవగాహన కల్పించారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి నిర్మాణమే మూలస్తంభమని, ఆ నిర్మాణాన్ని బలంగా నిలబెట్టే బాధ్యత బీఎల్‌ఏలపై ఉందని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో బీఎల్‌ఏలు పార్టీకి కీలక ప్రతినిధులుగా వ్యవహరించాలని, వారి పనితీరే బూత్ స్థాయి విజయాన్ని నిర్ణయిస్తుందని పేర్కొన్నారు.బీఎల్‌ఏలు తమ పరిధిలోని ప్రతి ఇంటి వివరాలను తెలుసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాపై పూర్తి అవగాహన కలిగి ఉండటం, కొత్తగా ఓటు హక్కు పొందిన వారిని గుర్తించడం, వలస వెళ్లిన వారి వివరాలను నమోదు చేయడం, మరణించిన వారి పేర్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండటం, పేర్లలో పొరపాట్లు, చిరునామా మార్పులను సరిచేయించడం వంటి బాధ్యతలను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని వివరించారు.ఓటర్ల జాబితాలో జరిగే చిన్నపాటి పొరపాట్లు కూడా ఎన్నికల సమయంలో తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని సదస్సులో హెచ్చరించారు. అందువల్ల ప్రతి బీఎల్‌ఏ తన పరిధిలోని ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించి ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే గుర్తించి సవరణలు చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు వినియోగించే అవకాశం కల్పించడంలో బీఎల్‌ఏల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు.ప్రతి బూత్ పరిధిలో ప్రజలతో నిరంతర అనుబంధం కొనసాగించాల్సిన అవసరాన్ని ప్రత్యేకంగా వివరించారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా, ఏడాది పొడవునా ప్రజలతో మమేకమై ఉండాలని సూచించారు.సంక్షేమ పథకాలపై వారికి అవగాహన కల్పించడం, ప్రభుత్వ విధానాలపై సమాచారం అందించడం, ప్రజలకు ఎదురయ్యే సమస్యలను నమోదు చేయడం, వాటిని నాయకత్వానికి చేరవేయడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.బీఎల్‌ఏలు ప్రజా సమస్యలను నమోదు చేసి పరిష్కార దిశగా తీసుకెళ్లే వారధిగా పనిచేయాలని సదస్సులో స్పష్టం చేశారు. తాగునీటి సమస్యలు, రహదారుల సమస్యలు, విద్యుత్ అంతరాయాలు, సాగునీటి ఇబ్బందులు, రైతాంగ సమస్యలు, ఉపాధి సమస్యలు, సంక్షేమ పథకాల అమలులో లోపాలు వంటి అంశాలపై క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరించి నివేదించాల్సిన బాధ్యత వారిదేనని తెలిపారు.శిక్షణలో భాగంగా బీఎల్‌ఏలకు ఓటర్ల జాబితా పరిశీలన విధానం, అభ్యంతరాల నమోదు ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులపై అభ్యంతరాలు తెలియజేసే విధానం, సంబంధిత పత్రాల సమర్పణ, సమాచార సేకరణ పద్ధతులు వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందించారు. ప్రతి బీఎల్‌ఏ తన బూత్ పరిధిలోని ఓటర్ల సమాచారంపై పూర్తి పట్టు సాధించాలని, సమాచారాన్ని క్రమబద్ధంగా నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని సూచించారు.ఎన్నికల సమయంలో బీఎల్‌ఏల సమన్వయం అత్యంత కీలకమని వక్తలు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు సరైన మార్గనిర్దేశం చేయడం, జాబితాలో పేర్లను ధృవీకరించడం, ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండటం, అవసరమైన సమాచారాన్ని వెంటనే నాయకత్వానికి చేరవేయడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.బూత్ స్థాయిలో బలమైన వ్యవస్థ ఉంటేనే పార్టీ ఎన్నికల్లో బలంగా నిలబడగలదని స్పష్టం చేశారు. ప్రతి బీఎల్‌ఏ తన బూత్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలని, ప్రజలతో బలమైన అనుబంధాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, నిబద్ధత, బాధ్యతతో పనిచేసే బీఎల్‌ఏలే పార్టీకి అసలైన బలం అని పేర్కొన్నారు.సదస్సులో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, ఎస్ఐఆర్ శిక్షణ ద్వారా పార్టీ కార్యకలాపాల నిర్వహణపై స్పష్టత పెరిగిందన్నారు. గ్రామస్థాయిలో మరింత చురుకుగా పనిచేసి ప్రజలతో మమేకమవుతామని తెలిపారు. బీఎల్‌ఏలు కూడా తమ బాధ్యతలపై పూర్తి అవగాహన లభించిందని, పార్టీ బలోపేతానికి మరింత అంకితభావంతో పనిచేస్తామని సంకల్పం వ్యక్తం చేశారు.సదస్సు ముగింపులో ప్రతి కార్యకర్త, ప్రతి బీఎల్‌ఏ తన పరిధిలో పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ద్వారా అందించిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి ప్రజలతో మరింత మమేకమవ్వాలని సూచించారు. ఈ శిక్షణ సదస్సు పార్టీ శ్రేణుల్లో కొత్త చైతన్యాన్ని నింపిందని, రానున్న రోజుల్లో జిల్లాలో పార్టీ కార్యకలాపాలు మరింత వేగవంతం కానున్నాయని నాయకులు స్పష్టం చేశారు.

## మూడోసారి పదోన్నతితో

# డిప్యూటీ కలెక్టర్‌గా పిన్నిక మధుసూదన్..

మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 26, (ప్రజా ప్రతిభ):

ప్రకాశం జిల్లా రెవిన్యూ శాఖలో సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందిన పిన్నిక మధుసూదన్‌కు డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి లభించింది. ప్రస్తుతం ఒంగోలు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వ రెవిన్యూ శాఖ అధికారికంగా పదోన్నతి ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లా వ్యాప్తంగా రెవిన్యూ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. దీర్ఘకాలంగా రెవిన్యూ శాఖలో నిబద్ధతతో సేవలందిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఆయనకు ఇది తగిన గుర్తింపుగా భావిస్తున్నారు.పిన్నిక మధుసూదన్ తన ఉద్యోగ జీవితంలో అనేక ప్రాంతాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. కొమరోలు, పెద్దారవీడు, బల్లికురవ, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవిన్యూ పరిపాలనలో తనదైన ముద్రవేశారు. ఆయా మండలాల్లో భూ వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాల సమస్యలు, ధ్రువపత్రాల జారీ, వారసత్వ హక్కుల నిర్ధారణ వంటి అనేక సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రజల నుంచి ప్రశంసలు అందుకున్నారు.ప్రస్తుతం జిల్లా కేంద్రం ఒంగోలులో తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన, ప్రజల సమస్యలను నేరుగా వినిపించుకునే విధానంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా విని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కార మార్గాలను చూపడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. పరిపాలనలో పారదర్శకత, వేగం, బాధ్యతాయుత వ్యవహారం కారణంగా ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారు.పిన్నిక మధుసూదన్‌కు గతంలో రెండు పర్యాయాలు డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి వచ్చినప్పటికీ, కొన్ని వ్యక్తిగత కారణాలతో ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించి తహసీల్దార్‌గా కొనసాగడం విశేషంగా నిలిచింది. ఉన్నత పదవికి అర్హత సాధించినప్పటికీ తన నిర్ణయానికి కట్టుబడి విధులు నిర్వర్తించడం ఆయనలోని క్రమశిక్షణకు నిదర్శనమని సహచర అధికారులు పేర్కొంటున్నారు. అయితే మూడోసారి పదోన్నతి రావడంతో ఈసారి డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.రెవిన్యూ శాఖలో విధులు నిర్వహించే సమయంలో ఆయన చూపిన సామర్థ్యం, ప్రజా సమస్యల పరిష్కారంలో తీసుకున్న చొరవ, పరిపాలనా నైపుణ్యం ఉన్నతాధికారుల దృష్టిని ఆకర్షించాయి. పలు సందర్భాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. రెవిన్యూ పరిపాలనలో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన సందర్భాల్లోనూ నిబంధనలకు కట్టుబడి వ్యవహరించడం ద్వారా ఆదర్శ అధికారిగా నిలిచారు.అధికారిగా మాత్రమే కాకుండా ప్రజలతో మమేకమై పనిచేసే వ్యక్తిగా పిన్నిక మధుసూదన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది.సమస్యలతో వచ్చే ప్రజలను గౌరవంగా స్వీకరించి, వారికి చట్టపరమైన పరిష్కార మార్గాలు సూచించడం ఆయన పనితీరులో ప్రధాన లక్షణంగా నిలిచింది. అందుకే ఆయన పనిచేసిన ప్రతి ప్రాంతంలో ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది.పిన్నిక మధుసూదన్ బిసి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్ సోదరుడు కావడం తెలిసిందే. కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన సామాజిక చైతన్యం, ప్రజా సేవా దృక్పథం ఆయన పరిపాలనలో ప్రతిబింబించిందని పలువురు పేర్కొంటున్నారు. సామాజిక బాధ్యతతో పాటు పరిపాలనా బాధ్యతలను సమన్వయం చేస్తూ ముందుకు సాగడం ఆయన ప్రత్యేకతగా చెప్పుకుంటున్నారు.డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి లభించడంతో సహచర అధికారులు, సిబ్బంది, సన్నిహితులు, ప్రజాప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నారు. కొత్త బాధ్యతల్లోనూ ఇదే నిబద్ధతతో పనిచేసి ప్రజల మన్ననలు పొందుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆయన అనుభవం, పరిపాలనా దక్షత జిల్లా పరిపాలనకు మరింత ఉపయోగపడుతుందని రెవిన్యూ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.ప్రజల సమస్యల పరిష్కారాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేసిన అధికారిగా పేరుపొందిన పిన్నిక మధుసూదన్‌కు లభించిన ఈ పదోన్నతి యువ అధికారులకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేస్తే ఉన్నత స్థానాలు స్వయంగా వస్తాయని ఆయన ప్రస్థానం మరోసారి రుజువు చేసిందని పేర్కొంటున్నారు.



# అమరవీరుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి.

## భావితరాలకు చరిత్రను అందించాలి..

మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 26, (ప్రజా ప్రతిభ):

మార్కాపురం పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులు, దేశ నిర్మాణంలో విశేష సేవలు అందించిన మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకునేలా పట్టణంలో తగిన స్మారక చిహ్నాలు లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్రను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనని, భావితరాలకు త్యాగధనుల సేవలను చేరవేయడానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.మార్కాపురం చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం కలిగిన పట్టణమని, అలాంటి ప్రాంతంలో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల జ్ఞాపకాలను నిలబెట్టే స్మారక నిర్మాణాలు లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను గుర్తుంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఆ బాధ్యతను ప్రభుత్వం ముందుండి నిర్వర్తించాలని సూచించారు.ప్రస్తుతం జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేవలం చిత్రపటాలకు పూలమాలలు వేసి నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొనడం దురదృష్టకరమని అన్నారు. మహనీయుల సేవలను స్మరించుకునే కార్యక్రమాలు కేవలం ఒకరోజు నిర్వహించే వేడుకలుగా కాకుండా, శాశ్వత స్మారక చిహ్నాల రూపంలో ప్రజల ముందుండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విగ్రహాలు కేవలం అలంకార ప్రతీకలు కావని, అవి చరిత్రను గుర్తు చేసే జీవంతమైన చిహ్నాలని వివరించారు.మార్కాపురం జిల్లా ఏర్పడిన తర్వాతనైనా పట్టణాభివృద్ధి ప్రణాళికల్లో చారిత్రక వారసత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా పట్టణంలోని చెరువు కట్ట ప్రధాన రహదారిని ఆధునికీకరించి, ఆ ప్రాంతాన్ని స్మారక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని సూచించారు. రహదారికి ఇరువైపులా స్వాతంత్ర్య సమరయోధుల స్మారక స్తూపాలు ఏర్పాటు చేస్తే పట్టణానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని తెలిపారు.చెరువు కట్ట ప్రాంతాన్ని సుందరీకరించి అక్కడ స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను తెలియజేసే శిలాఫలకాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ ప్రాంతం ప్రజలకు విశ్రాంతి కేంద్రంగా మారడంతో పాటు, చరిత్రను పరిచయం చేసే సాంస్కృతిక ప్రదేశంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు.పట్టణంలోని ప్రధాన కూడళ్లలో దేశ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, సమాజ సేవకుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి కూడలి ఒక చరిత్రను చెప్పేలా ఉండాలని, ప్రజలు ఆ మహనీయుల సేవలను గుర్తు చేసుకునేలా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.మార్కాపురంలో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం గాంధీ పార్క్, గడియారం స్తంభం కూడలిలో తప్ప మరెక్కడా పూర్తిస్థాయిలో లేకపోవడం విచారకరమని గుర్తు చేశారు.మార్కాపురం వంటి ప్రముఖ పట్టణంలో మహాత్మా గాంధీతో పాటు భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు, అంబేద్కర్ వంటి మహనీయుల విగ్రహాలు కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.యువతలో దేశభక్తి, సేవా స్ఫూర్తి పెంపొందించాలంటే చరిత్రను ప్రత్యక్షంగా చూపించే స్మారక చిహ్నాలు అవసరమని తెలిపారు. పుస్తకాల ద్వారా చదివే చరిత్ర ఒక రూపమైతే, విగ్రహాలు చూసి తెలుసుకునే చరిత్ర మరింత ప్రభావవంతమని చెప్పారు. భావితరాలు మహనీయుల గురించి తెలుసుకుని వారిని ఆదర్శంగా తీసుకునేలా చేయడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు.పట్టణ సుందరీకరణలో భాగంగా విగ్రహాల చుట్టూ ఉద్యానవనాలు, విశ్రాంతి కేంద్రాలు, సమాచార ఫలకాలు ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. అలాంటి అభివృద్ధి పనులు మార్కాపురాన్ని సాంస్కృతికంగా, చారిత్రకంగా మరింత ప్రత్యేకంగా నిలబెడతాయని అన్నారు.పట్టణాభివృద్ధి అంటే కేవలం రహదారులు, భవనాలు, వాణిజ్య నిర్మాణాలు మాత్రమే కాదని, చరిత్రను నిలబెట్టే నిర్మాణాలు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. చరిత్రను మరచిపోయే సమాజం తన మూలాలను కోల్పోతుందని, అందువల్ల అమరవీరుల జ్ఞాపకాలను సజీవంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి మార్కాపురంలో అమరవీరుల స్మారక విగ్రహాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సామాజిక సంస్థలు కలిసి ముందుకొచ్చి ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు.మార్కాపురం ప్రజలంతా చరిత్రను కాపాడే ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. అమరవీరుల విగ్రహాల ఏర్పాటు ద్వారా వారి త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, భావితరాలకు దేశభక్తి, సేవా భావనలను అందించవచ్చని స్పష్టం చేశారు.చరిత్రను సజీవంగా నిలబెట్టడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.



## జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు

# అధికారులు మరింత నిబద్ధతతో పనిచేయాలి

### వాలంటీర్ల నియామకంలో వేగం పెంచాలిలి

### సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీలకూ బాధ్యతలు

### :జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్





**అనకాపల్లి జిల్లా బ్యూరో: (జర్నలిస్ట్ నాగేశ్వరరావు )ప్రజా ప్రతిభ :మే 26 :**

జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు అధికారులు మరింత నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లాలో వంద శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అక్షర ఆంధ్ర" (ఉల్లాస్ ) అక్షరాస్యత కార్యక్రమం అమలుపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ చాంబర్ లో జరిగింది.

ఈ సమావేశంలో అక్షరాంధ్ర రెండవ దశలో భాగంగా 1,01,086 మంది నిరక్షరాస్తులను అక్షరాంధ్ర యాప్ లో నమోదు చేయవలసిన బాధ్యతను సచివాలయ, విద్య మరియు సంక్షేమ అసిస్టెంట్, డిఆర్డిఏ గ్రామ సమన్వయకర్తలు, క్రస్టర్ కోఆర్డినేటర్లు డ్వామా సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్స్ మేట్స్ సమన్వయంతో గ్రామస్థాయి నుండి, మండల స్థాయిలో ఎంపీడీవోలు డిప్యూటీ ఎంపీడీవోలు ఏ పి ఓ లు ఏపీఎంలు, ఎం ఎస్ జి ఏస్ డెబ్లు అధికారి బాధ్యత తీసుకొని రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని 1 వాలంటీర్ కు 10 మంది అభ్యాసకులతో మ్యాచింగ్, బ్యాచింగ్ చేసి 15 రోజులలో పూర్తి చేయాలని ఆదేశించడం అయినది.

గతంలో జరిగిన కొన్ని క్లాసులను పరిశీలించినప్పుడు వాలంటీర్ల నియామకం ఆశించిన స్థాయిలో లేదని, మంచి సామర్థ్యం కలిగిన వారిని వాలంటీర్ టీచర్లగా నియమించి, 100 గంటలు తరగతులు నిర్వహించి , ప్రతి అభ్యాసకులు 100 గంటలు తరగతులు పూర్తిచేయాలని ఇందుకు సంబంధించి అటెండెన్స్ అక్షర ఆంధ్ర యాప్ లో నమోదు చేయాలని, రెండవ దశలో ఏ యే అంశాలలో వెనుక పడ్డాము ఆ అంశాలపై దృష్టి సారించి మూడవ దశలో మంచి ఫలితాలు చూపించాలని జిల్లా అధికారులను ఆదేశించారు, 100 రోజుల పాటు క్లాసులు షెడ్యూల్ చేసినప్పుడు, దానికి తగినట్లుగా హాజరు ఉండాలని స్పష్టం చేశారు. విద్య అనేది ఒక దానం లాంటిదని, దీనిని కేవలం గౌరవ వేతనం లేదా ఆదాయం కోసమే కాకుండా సామాజిక బాధ్యతగా తీసుకుని పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాల్లోని నిరక్షరాస్యులైన మహిళలు, పురుషులకు చదువు చెప్పేలా వాలంటీర్లను ఎంపిక చేసేటప్పుడు సరైన వ్యక్తులను గుర్తించాలన్నారు. గతంలో పురుషుల సంఖ్య తక్కువగా ఉందని, ఈసారి పురుషుల భాగస్వామ్యాన్ని కూడా పెంచాలని సూచించారు. ఒక మండలాన్ని కొన్ని క్లస్టర్లు చొప్పున ఏర్పాటు చేయాలని, ప్రతి క్లస్టర్ పరిధిలోకి వచ్చే సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది క్లాసులను ఆకస్మికంగా తనిఖీ చేసి, నివేదికలు అందించాలన్నారు. మన జిల్లా అక్షరాస్యత జాతీయ సగటు కంటే తక్కువగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అందువలన ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకుని అనకాపల్లి జిల్లా ను అక్షరాస్యతలో ముందు వరుసలో తీసుకు రావడానికి కృషి చేయాలని ఆదేశించారు, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన జిల్లాగా చెప్పుకుంటున్న తరుణంలో, నిరక్షరాస్యత ఎక్కువగా ఉండటం సరికాదన్నారు. గత ఏడాది లక్ష మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దగా, ఈ ఏడాది కూడా అదే లక్ష్యంతో ముందుకు సాగాలని వయోజన విద్యాశాఖ అధికారులకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించారు , ఇందుకు గాను లైన్ డిపార్ట్మెంట్ల అధికారులు సహకరించాలని, సిబ్బంది అందరు సమన్వయంతో పనిచేసి జిల్లాను అక్షర అనకాపల్లి గా మార్చాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి సచీదేవి , డ్వామా పీడీ నిర్మలాదేవి, ఐసిడిఎస్, పిడి సూర్యలక్ష్మి , డిపిఓ సందీప్ మెప్మా పీడీ రమేష్ రామన్, ఎస్ జి ఎస్ డబ్ల్యు బివి సత్యనారాయణ ఏడి అడల్ట్ ఎడ్యుకేషన్, డి.చిన్ని కృష్ణ మరియు ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

# 23 ఏళ్ల తర్వాత పునఃకలయిక

### చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్న చినదొడ్డిగల్లు జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు






**నక్కపల్లి, మే 26, (ప్రజా ప్రతిభ) :**

చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు 23 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మంగళవారం ఒక్కచోట చేరి తమ బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. స్థానిక ప్రసిద్ధి చెందిన రేబాక గూడూపుమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్న ఈ బ్యాచ్ విద్యార్థులు, ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.

**ఆలయంలో పూజలు, ఆత్మీయ పలకరింపులు**

ఉదయం 10 గంటలకు ఆలయానికి చేరుకున్న సుమారు 25 మంది పూర్వ విద్యార్థులు, సంప్రదాయబద్ధంగా అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, హారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలోనే ఏర్పాటు చేసిన వేదికపై ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ 23 ఏళ్ల విరామానికి తెరదించారు. పాఠశాల విద్య అనంతరం ఎవరి జీవితం వారు నిర్మించుకున్న ఈ మిత్రబృందం, ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులుగా, మరికొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, వ్యాపారులుగా, ఉపాధ్యాయులుగా, వ్యవసాయదారులుగా రాణిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ వృత్తిపరమైన ప్రయాణం, ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలను సహచరులతో పంచుకున్నారు.

**ఆటపాటలతో సందడి, భావోద్వేగ క్షణాలు**

మధ్యాహ్న భోజనాల అనంతరం పాఠశాల రోజుల్లోని ఆటలు, పాటలు, అల్లరి పనులను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. పాత ఫోటోలు చూసుకుంటూ, ఉపాధ్యాయులను స్మరించుకుంటూ పలువురు భావోద్వేగానికి లోనయ్యారు. "బెంచీ మీద గిల్లికజ్జాలు, సారు దగ్గర దెబ్బలు, సైకిల్‌పై స్కూల్‌కు వెళ్లిన రోజులు మళ్లీ కళ్లముందు కదలాడాయి" అని పలువురు పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

**భవిష్యత్తు కార్యాచరణ**

ఇకపై ప్రతి రెండేళ్లకోసారి ఇలాంటి సమ్మేళనం ఏర్పాటు చేసుకోవాలని, పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా తీర్మానించుకున్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చేయూతనివ్వాలని నిర్ణయించారు. సాయంత్రం వరకు సాగిన ఈ ఆత్మీయ కలయిక, మళ్లీ కలుస్తామన్న హామీతో, గ్రూప్ ఫోటోలతో ముగిసింది. చిన్ననాటి స్నేహం చెరిగిపోదని ఈ పూర్వ విద్యార్థులు నిరూపించారు.

# అకాల గాలివాన బీభత్సం

### నక్కపల్లి మండలంలో నేలకొరిగిన పంటలు, రైతులకు తీవ్ర నష్టం

### మామిడి, జీడి, బొప్పాయి, అరటి తోటలు నేలమట్టం -- హోంమంత్రి "అనిత" ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పరిశీలన, నష్టం అంచనాకు చర్యలు

### రైతుల నష్టాన్ని అంచనా వేయాలని హార్టికల్చర్ సాయి ప్రియ తో మాట్లాడిన నియోజవర్గ కన్వీనర్ "కొప్పిశెట్టి వెంకటేష్"

**నక్కపల్లి, మే 26, (ప్రజా ప్రతిభ) :**



అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, నక్కపల్లి మండలంలో శనివారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. గంటపాటు ఈదురు గాలులతో కురిసిన వర్షం, ధాటికి మామిడి, జీడి, బొప్పాయి, అరటి తోటలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. కాయలతో కళకళలాడుతున్న తోటలు ఒక్కసారిగా నేలకొరగడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కన్నీరుమున్నీరవుతున్నారు.

**పంట నష్టంపై హోంమంత్రి ఆరా..**

మండలంలోని పలు గ్రామాల్లో పంట నష్టం వివరాలు తెలుసుకున్న రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత వెంటనే స్పందించారు. జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణతో ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులను ఆదుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం తరఫున అన్నివిధాలా అండగా ఉంటామని రైతులకు భరోసా ఇవ్వాలని సూచించారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలన**

కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల హార్టికల్చర్ అధికారి సాయి ప్రియతో కలిసి దెబ్బతిన్న తోటలను పరిశీలించాలని ఆయన అన్నారు. మండలంలోని గోడిచెర్ల, ఉద్దండపురం, గుల్లిపాడు, రేబాక, తదితర గ్రామాల్లో పర్యటించి మామిడి, జీడి, బొప్పాయి, అరటి తోటల్లో జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించాలని వెంకటేష్ కోరారు. ఈ సందర్భంగా కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ, "అకాల గాలివానతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట చేతికొచ్చే సమయంలో ఇలా జరగడం దురదృష్టకరం. హార్టికల్చర్ అధికారులు వెంటనే గ్రామాలవారీగా పంట నష్టం అంచనాలు పూర్తిచేసి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించాలి. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలి" అని కోరారు.

**ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు**

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గింజల లక్ష్మణరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మునిషా బేగం, మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, గోడిచెర్ల పీఏసీఎస్ చైర్మన్ దార్ల కృష్ణ, ఉద్దండపురం మాజీ సర్పంచ్ పొడగట్ల రమణ, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కుర్ర బాబ్జి, తదితర అధికారులు పాల్గొన్నారు. హార్టికల్చర్ అధికారి సాయి ప్రియ మాట్లాడుతూ, సిబ్బందితో కలిసి రెండు రోజుల్లో నష్టం అంచనాలు పూర్తి చేసి జిల్లా యంత్రాంగానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

## కింతలిలో ఘనంగా పైడితల్లమ్మ పండుగ



**మాడుగుల,మే 26 ప్రజా ప్రతిభ:**

మాడుగుల మండలంలో కింతలి గ్రామంలో మంగళవారం శ్రీ పైడితల్లమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మూడు సంవత్సరాలకి ఒకసారి జరిగే పండుగ కావడంతో ఎక్కువ మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాళపురెడ్డి సత్తిబాబు, రెడ్డి సాయి ఆధ్వర్యంలో రాణా ప్రతాప్ సాంఘిక నాటకం ప్రదర్శన ఏర్పాటు చేశారు. రాత్రికి నేలవేశాలు బండ్ల వేషాలు చిత్ర విచిత్రమైనది వేషాలతో మందు గుండు సామాగ్రితో పండుగ ఘనంగా ఏర్పాటు జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మైచర్ల సన్యాసిరావు, మైచర్ల సత్యంనాయుడు, మైచర్ల చందర్రావు, ఆదాడ రాజు, అప్పాన నారాయణరావు. సుంకరి శ్రీనివాసరావు, కోట్ని వెంకటరాజు, మైచర్ల నాగేశ్వరరావు, మైచర్ల శ్రీను పాల్గొన్నారు.

## చెరువుల అభివృద్ధి పనుల పరిశీలన



**మాడుగుల,మే 26 ప్రజా ప్రతిభ:**

మాడుగుల మోదకొండమ్మ ఆలయంసమీపంలో పాండవుల చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఉదయం పిడి నిర్మళదేవి, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఏపిడి శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం ఎం. కోడూరు గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న కోనాడ చెరువును కూడా పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి పని ఏ విధంగా జరుగుతున్నది వివరాలు సేకరించారు. అనంతరం ఎంపిడిఒ కొంకి అప్పారావు మోదకొండమ్మ గుడి దగ్గర గుడి వెనుక భాగంలో పరిసరాలు గమనించి చెత్తా చెదారం వెంటనే తొలగించాలని, జాతరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం అన్నా క్యాంటీన్లో ఉదయం అల్పాహారం ఏ విధంగా ఉన్నది పరిశీలించి అల్పాహారం రుచి చూశారు. సుమారు 250 మంది దాకా అల్పాహారం పంపిణీ చేస్తున్నట్టు సిబ్బంది తెలిపారు. అల్పాహారం రుచిగానే ఉందని ఎంపీడీవో అప్పారావు తెలియచేశారు. కార్యక్రమంలో ఎనర్జీస్ ఏపీవో జె. మురళీకృష్ణ, ఈసీ గంగ్రెడ్డి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సన్యాసిరావు పాల్గొన్నారు.

## మహానాడు ఏర్పాటుకు స్థలాల పరిశీలన



**మాడుగుల,మే 26 ప్రజా ప్రతిభ:**

ఈ నెల 27, 28 తేదీలలో డిజిటల్ మహానాడు నిర్వహించేందుకుమాడుగుల మండలంలో మూడు ప్రాంతాలలో టీడీపీ స్టేట్ సెక్రెటరీ దాసరి శ్రీనివాసరావు (భీమిలి) స్థలాల పరిశీలన చేశారు. మాడుగుల, కేజే.పురం. జేడీ. పేట ప్రాంతాలలో డిజిటల్ మహానాడు నిర్వహిస్తున్నామని దాసరి శ్రీనివాసరావు తెలిపారు. మాడుగుల నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోనూ మహానాడు స్థలాలు పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నందారపు సన్యాసిరావు, టీడీపీ క్లస్టర్ ఇన్చార్జ్ బీశెట్టి విజయలక్ష్మి, వడ్డీ రాజ్ కుమార్, వర్మ పాల్గొన్నారు.

## అచ్యుతాపురంలో ఎమ్మెల్యే పారిశుధ్య నిర్వహణపై ఆకస్మిక తనిఖీ

### అధికారులు తీరుపై అసంతృప్తి వ్యక్తం

### ప్రజా ఆరోగ్యానికి భంగం కలిగిస్తే చర్యలు: ఎమ్మెల్యే విజయ్ కుమార్ హెచ్చరిక



**అనకాపల్లి జిల్లా బ్యూరో/అచ్చుతాపురం ప్రజా ప్రతిభ మే 26:**

అచ్యుతాపురం మండల కేంద్రంలో ఎమ్మెల్యే విజయ్ కుమార్ పారిశుధ్య నిర్వహణపై ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మంగళవారం మోసయ్యపేట-గాజువాక రోడ్డు లోని దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాలను వద్ద పారిశుధ్య నిర్వహణ నిర్లక్ష్యం అపరిశుభ్రత నెలకొనడం పట్ల ఎమ్మెల్యే విజయ్ కుమార్ అధికారులు తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా ఆరోగ్యానికి భంగం కలిగించే విధంగా పరిస్థితులు ఉండకూడదని డ్రైనేజీ వ్యవస్థ ఎప్పటికప్పుడు శుభ్రపరచడంతో పాటు మురుగనీరు నిల్వ లేకుండా పూడికతీతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు కూటమినేతలు పాల్గొన్నారు.

## వేతనాలు పెంచాలంటూ
## మైహోమ్ సిమెంట్ ఫ్యాక్టరీ ఎదుట కార్మికుల ఆందోళన



**అనకాపల్లి జిల్లా బ్యూరో/ఎలమంచిలి ప్రజా ప్రతిభ మే 26:**

వేతనాలు పెంచాలంటూ కాంట్రాక్ట్ కార్మికులు ఎలమంచిలి మండలం ములకలాపల్లి మై హోమ్ సిమెంట్ ఫ్యాక్టరీ మెయిన్ గేట్ వద్ద మంగళవారం నిరసనకు దిగారు. అంతేకాకుండా వారాంతపు సెలవుల సైతం ఇవ్వకుండా గత రెండు సంవత్సరాలుగా అవే వేతనాలు కొనసాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా సిమెంట్ ఫ్యాక్టరీలో వివిధ కాంట్రాక్టర్ల వద్ద 500 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారని కార్మికుల కష్టం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తారు. విధులలో చేరి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ అవే వేతనాల కొనసాగించడంతోపాటు స్కిల్డ్ కార్మికులకు 703 రూపాయలు, సెమీ కిల్డ్ వర్కర్స్ కు 560 రూపాయలు అన్స్కిల్డ్ వర్కర్స్ కు 470 రూపాయలు ఇస్తూ మస్తుర విధానంలోనే కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కంపెనీ యాజమాన్యం రోజుకు 9 రూపాయలు చొప్పున వేతనం పెంపు చేస్తామని ఇది జూన్ నెల నుండి అమలు అవుతుందని ప్రకటించడంతో ఈ విధానం నచ్చిన కార్మికులు విధులను బహిష్కరించి తమ నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కార్మికుల భద్రత ప్రయోజనాలు దృష్టిలో యూనియన్ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో కష్టపడ్డ కార్మికులకు తగిన గుర్తింపు ఇవ్వాలని సీనియారిటీని బట్టి స్థాయి పెంపు జరగాలని కోరారు.

## చీడిగుమ్మలకు నూతన
# పీహెచ్‌సీ భవనం మంజూరు

**సభాపతి అయ్యన్నచొరవతో రూ. 1.93 కోట్ల నిధులు విడుదల.**



**గొలుగొండ, మే 26 (ప్రజా ప్రతిభ)**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలోని గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామానికి నూతన పీహెచ్‌సీ భవన నిర్మాణం మంజూరైంది. ఇప్పటివరకు సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్న చీడుగుమ్మల హాస్పిటల్‌కు శాశ్వత భవనాన్ని నిర్మించేందుకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. స్పీకర్ గారి విజ్ఞప్తి మరియు ప్రత్యేక కృషితో ప్రభుత్వం ఈ భవన నిర్మాణానికి రూ. 1.93 కోట్ల భారీ నిధులను కేటాయించింది. ఈ నిర్మాణ పనుల బాధ్యతను ఏపీఎంఎస్ఐడీసీ సంస్థకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడం పట్ల స్థానిక ప్రజలు, గొలుగొండ మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు

## ప్రతి ఒక్కరు వ్యక్తిగత
# మరుగుదొడ్లను నిర్మించుకోవాలి




**నాతవరం, మే,26((ప్రజా ప్రతిభ)**

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం, సత్య శ్రీనివాస్ అన్నారు మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వెలుగు సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర లో భాగంగా పరిసరాల పరిశుభ్రత పాటు బహిరంగ మలవిసర్జన చేయకూడదని ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న వ్యక్తిగత రుణం ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకొని స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర గా గ్రామాల్ని చేసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మూర్తి బాబు, మండల పరిషత్ సీనియర్ సహాయకులు ఎం.వి ఎస్ ఎస్ ప్రసాద్ పంచాయతీ కార్యదర్శి రమేష్, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## బస్సు షెల్టర్ లో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

**నాతవరం, మే,26,,(ప్రజా ప్రతిభ)**



మండల కేంద్రం నాతవరం స్థానిక బస్టాండ్ లో గల బస్ షెల్టర్ లో యూత్ సభ్యులు వేసవిలో మండుతున్న ఎండల వలన ప్రజలు దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు యూత్ సభ్యులు తెలిపారు ఉపాధి కూలీలు ప్రయాణికులు వృద్ధులు వినియోగించుకోవాలని వారు కోరారు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని పలువురు అభినందించారు

## ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో
# నూతన రైతు బజార్ ప్రారంభం

**రూ.15 లక్షల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో నిర్మాణం**

**జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**





**అనకాపల్లి జిల్లా బ్యూరో ప్రజా ప్రతిభ మే 26:**

రైతులకు నేరుగా మార్కెట్ సౌకర్యాలు కల్పిస్తూ, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు, వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంచే లక్ష్యంతో ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో నూతన రైతు బజార్ ప్రారంభంచినట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. మంగళవారం ఉదయం ఎన్టీఆర్ మార్కెట్ యార్డు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన రైతు బజార్ ను స్థానిక శాసనసభ్యులు కొనసాల రామకృష్ణ మరియు జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యం పటేల్ లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో డా. ఎన్‌టీఆర్ మార్కెట్ యార్డు ప్రాంగణంలో రూ.15 లక్షల వ్యయంతో ఆధునిక వసతులతో రైతుబజారును నిర్మించడం జరిగిందన్నారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు మధ్యవర్తుల ప్రభావం తగ్గించి రైతులకు గిట్టుబాటు ధరలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ రైతుబజారును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**శాసనసభ్యుల కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ....**

నూతన రైతుబజారులో రైతులు తమ పంటలను నేరుగా విక్రయించుకునేందుకు ప్రత్యేక స్టాల్స్, తాగునీటి సౌకర్యం, పారిశుధ్య వసతులు, వినియోగదారుల కోసం విశ్రాంతి ఏర్పాట్లు, రవాణా సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. స్థానిక రైతులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు పచ్చికూర రాము, ఉపాధ్యక్షులు కర్రి వెంకట సత్యనారాయణ, ఉన్నత శ్రేణి కార్యదర్శి డి. శకుంతల మరియు పాలకవర్గ సభ్యులు . రైతులు, వ్యాపారులు, వినియోగదారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్లను
# స్వచ్ఛందంగా నిషేధించాలి...

**ఎలమంచిలి కాయగూరలమార్కెట్ వ్యాపారస్తులతో ప్రత్యేక సమావేశం**

**పట్టించుకోకుంటే గురువారం నుంచి తడి చెత్త పొడి చెత్త తరలింపు**

**నిలిపివేత: మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు**

**అనకాపల్లి జిల్లా బ్యూరో/ఎలమంచిలి (జర్నలిస్ట్ నాగేశ్వరావు)ప్రజా ప్రతిభ మే 26:**




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న క్లీన్ స్వీప్ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ఎలమంచిలి మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిషేధించాలని కోరారు. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ వ్యాపారులతో మంగళవారం ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. కూరగాయల వ్యాపారులు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని అంతేకాకుండా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని కోరారు. ఎన్నిమార్లు వ్యాపారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని ఇదే ధోరణి కొనసాగితే ఇకనుండి తడి చెత్త పొడి చెత్త తీసుకెళ్లే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అందుకు వచ్చే గురువారం వరకు సమయం ఇవ్వడంతో పాటు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లను వాడుకూడదని అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత తో పాటు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇకనుండి ప్లాస్టిక్ కవర్లు వాడిన అమ్మిన ఎప్పటికప్పుడు ముమ్మరి తనిఖీలు చేపట్టడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని భారీగా ఫైన్ లు విధిస్తామని హెచ్చరించారు. విధిగా అధికారులు తనిఖీలు చేపడతారని ఎవరైనా కవర్లు వాడిన అమ్మినా ఎప్పటికప్పుడు నివేదిక తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వ్యాపారులు సైతం ఇకనుండి అప్రమత్తంగా ఉండాలని ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా కాయగూరలు ఇతర వస్తు సామాగ్రిలు కొనుగోలు చేసేందుకు నార సంచులు లేదా గుడ్డ సంచులను వినియోగించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం వైస్సార్సీపీ
# కార్యాలయంలో ఎస్ఐఆర్ సమీక్ష..

**బీఎల్ఏలే పార్టీ బలానికి మూలస్తంభమని అన్నా రాంబాబు..**

**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందూరు శ్రీనివాసరెడ్డి, మే 26, (ప్రజా ప్రతిభ):**

మార్కాపురంలోని వైస్సార్సీపీ కార్యాలయంలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జ్ అన్నా రాంబాబు ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించారు. బూత్ స్థాయి ప్రతినిధులైన బీఎల్ఏల బాధ్యతలు, పార్టీ బలోపేతంలో వారి పాత్ర, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై అన్నా రాంబాబు సమగ్రంగా దిశానిర్దేశం చేశారు. ఒంగోలులో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన, శిక్షణ సదస్సులో పొందిన మార్గదర్శకాలను మార్కాపురం నియోజకవర్గంలోని ప్రతి బూత్ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అన్నా రాంబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ, పార్టీ విజయానికి బూత్ స్థాయి నిర్మాణమే అసలైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. బూత్ స్థాయిలో బలమైన నిర్మాణం ఉంటేనే పార్టీ ప్రజల్లో మరింత బలంగా నిలుస్తుందని అన్నా రాంబాబు పేర్కొన్నారు. ప్రతి బీఎల్ఏ పార్టీకి కళ్లూ, చెవుల్లా వ్యవహరించాలని అన్నా రాంబాబు సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే నాయకత్వానికి చేరవేయడంలో బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని అన్నా రాంబాబు వివరించారు. ప్రతి బీఎల్ఏ తన పరిధిలోని ప్రతి కుటుంబంతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని అన్నా రాంబాబు సూచించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నా రాంబాబు అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా ప్రజల మధ్య ఉండే కార్యకర్తలే పార్టీకి అసలైన బలం అని అన్నా రాంబాబు స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ప్రతి బీఎల్ఏ ప్రధాన బాధ్యత అని అన్నా రాంబాబు పేర్కొన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారిని గుర్తించడం, పేర్లలో పొరపాట్లను సరిచేయించడం, వలస వెళ్లిన వారి వివరాలను నమోదు చేయడం, మరణించిన వారి పేర్ల తొలగింపుపై అప్రమత్తంగా వ్యవహరించడం వంటి అంశాల్లో బీఎల్ఏలు చురుకుగా ఉండాలని అన్నా రాంబాబు సూచించారు. ఓటర్ల జాబితాలో చిన్న పొరపాటు కూడా ఎన్నికల సమయంలో పెద్ద నష్టానికి దారి తీసే అవకాశముందని అన్నా రాంబాబు హెచ్చరించారు. అందుకే ప్రతి బీఎల్ఏ తన బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నా రాంబాబు స్పష్టం చేశారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు వినియోగించే అవకాశం కల్పించడంలో బీఎల్ఏల బాధ్యత ఎంతో కీలకమని అన్నా రాంబాబు వివరించారు. ప్రజా సమస్యలపై బీఎల్ఏలు ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని అన్నా రాంబాబు సూచించారు. తాగునీరు, విద్యుత్, రహదారులు, సాగునీరు, రైతాంగ సమస్యలు, సంక్షేమ పథకాల అమలులో లోపాలు వంటి అంశాలను గుర్తించి వెంటనే పార్టీ దృష్టికి తీసుకురావాలని అన్నా రాంబాబు కోరారు. ప్రజల సమస్యలపై వేగంగా స్పందించడం ద్వారా పార్టీపై విశ్వాసం మరింత పెరుగుతుందని అన్నా రాంబాబు తెలిపారు. బీఎల్ఏలు కేవలం ఎన్నికల బాధ్యతలకే పరిమితం కాకుండా ప్రజలకు పార్టీ కార్యక్రమాలు, పార్టీ విధానాలపై అవగాహన కల్పించాలని అన్నా రాంబాబు పేర్కొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పార్టీపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించే బాధ్యతను నిర్వర్తించాలని అన్నా రాంబాబు సూచించారు. ఎస్ఐఆర్ ద్వారా పార్టీ నిర్మాణాన్ని మరింత క్రమబద్ధీకరించే అవకాశం ఉందని అన్నా రాంబాబు అన్నారు. ప్రతి బూత్‌లో సమర్థవంతమైన వ్యవస్థను నెలకొల్పడం ద్వారా మార్కాపురం నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలని అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. సమావేశంలో అన్నా రాంబాబు బీఎల్ఏలకు ప్రత్యేక మార్గదర్శకాలు అందించారు. ఓటర్ల జాబితా పరిశీలన, అభ్యంతరాల నమోదు, కొత్త ఓటర్ల నమోదు, ప్రజా సమస్యల సేకరణ, నివేదికల సమర్పణ వంటి అంశాలపై అన్నా రాంబాబు సవివరంగా వివరించారు. ప్రతి బూత్‌ను ఆదర్శ బూత్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నా రాంబాబు సూచించారు. పార్టీ బలోపేతానికి క్రమశిక్షణ, బాధ్యత, సమన్వయం అవసరమని అన్నా రాంబాబు స్పష్టం చేశారు. ప్రతి బీఎల్ఏ తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తే మార్కాపురం నియోజకవర్గంలో పార్టీకి అపార బలం చేకూరుతుందని అన్నా రాంబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో పాల్గొన్న బీఎల్ఏలు మాట్లాడుతూ, అన్నా రాంబాబు అందించిన మార్గదర్శకాలు తమకు స్పష్టమైన దిశానిర్దేశం చేశాయని తెలిపారు. అన్నా రాంబాబు సూచించిన విధంగా ప్రతి ఇంటికి చేరుకుని ప్రజలతో మమేకమై పనిచేస్తామని వారు సంకల్పం వ్యక్తం చేశారు. సమావేశం ముగింపులో అన్నా రాంబాబు మాట్లాడుతూ, ప్రతి బీఎల్ఏ తన బూత్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రజలతో నిరంతర అనుబంధం కొనసాగిస్తూ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలంగా నిలబెట్టాలని అన్నా రాంబాబు సూచించారు. మార్కాపురం నియోజకవర్గంలో పార్టీని అజేయ శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అన్నా రాంబాబు స్పష్టం చేశారు.



# ప్రజల సంతృప్తే అధికారుల పనితీరుకు కొలమానం..

## సేవలందించడంలో నిర్లక్ష్యం వద్దని కలెక్టర్ హెచ్చరిక..





**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 26, (ప్రజా ప్రతిభ):**

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రజల సంతృప్తి మేరకు పూర్తిస్థాయిలో పనిచేయడమే అధికారుల ప్రధాన బాధ్యత అని జిల్లా కలెక్టర్ విజయ సునీత స్పష్టం చేశారు. ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. పెన్షన్ పంపిణీ, ఐవిఆర్ఎస్ స్పందన వంటి అంశాల్లో పనితీరును మరింత మెరుగుపరచాలని సూచించారు.మంగళవారం మార్కాపురం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న పింఛన్ పంపిణీ విధానం, లబ్ధిదారులకు సేవల అందజేత, ఐవిఆర్ఎస్ కాల్స్ స్పందనపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు చేరువగా ఉండే సేవల విషయంలో ఎక్కడా అలసత్వం సహించబోమని స్పష్టం చేశారు.పింఛన్ పంపిణీ ప్రక్రియలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా జిల్లాను రాష్ట్రంలో ముందువరుసలో నిలిపేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేయడం లేదనే సమాచారం అందిందని, ఇది సరైన విధానం కాదని హెచ్చరించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సమయానికి పింఛన్ అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ప్రతి నెలా లబ్ధిదారులు తప్పకుండా పింఛన్ అందుకునేలా క్షేత్రస్థాయిలో అధికారులు చొరవ చూపాలని సూచించారు. వృద్ధులు, వికలాంగులు, ఆధారపడిన కుటుంబాలు పింఛన్లపై ఆధారపడుతున్నందున ఈ అంశంలో నిర్లక్ష్యం చోటుచేసుకోవడం అస్సలు సమంజసం కాదని స్పష్టం చేశారు.పింఛన్ పంపిణీ కేవలం పరిపాలనా ప్రక్రియ మాత్రమే కాదని, అది ప్రజల జీవనాధారానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు.ఐవిఆర్ఎస్ కాల్స్ విషయంలో కూడా జిల్లాలో కొంత వెనుకబాటు కనిపిస్తోందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చే స్పందనను మరింత మెరుగ్గా స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఐవిఆర్ఎస్ సర్వేలో ప్రజల స్పందన మెరుగుపడేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ప్రజలకు ఐవిఆర్ఎస్ కాల్స్ ప్రాముఖ్యతపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని తెలిపారు. కాల్స్ వచ్చినప్పుడు వాటికి సరైన సమాధానాలు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ సేవల నాణ్యతను అంచనా వేయవచ్చని ప్రజలకు వివరించాలని సూచించారు. ఐవిఆర్ఎస్ వ్యవస్థను ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే సమర్థవంతమైన సాధనంగా అధికారులు ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.రాబోయే నెల రోజుల్లో పెన్షన్ పంపిణీ, ఐవిఆర్ఎస్ స్పందన అనే రెండు అంశాల్లో గణనీయమైన పురోగతి కనిపించాలన్నారు. ఈ రెండు రంగాల్లో పనితీరు మెరుగుపరచుకుని జిల్లా స్థాయిలో ఆదర్శంగా నిలవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు అందించే సేవల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.అధికారుల పనితీరుకు అసలు కొలమానం ప్రజల సంతృప్తేనని కలెక్టర్ తెలిపారు. ప్రజలు సంతృప్తిగా ఉంటేనే పరిపాలన విజయవంతమైందని భావించవచ్చని అన్నారు. ప్రతి అధికారి ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి స్పందించాలని సూచించారు.ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ చేరేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, వెంటనే పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే పరిపాలనపై విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, డిఆర్డిఎ ఇంచార్జి పీడీ నీలకంఠారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ప్రజా సేవల అమలులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజల సంతృప్తినే లక్ష్యంగా పెట్టుకుని ప్రతి అధికారి పనిచేయాలని కలెక్టర్ మరోసారి స్పష్టం చేశారు.

# పసుపు పండుగ 'మహానాడు' విజయవంతం చేద్దాం

## మారేడుమిల్లిలో రెండు రోజుల పాటు హైబ్రిడ్ విధానంలో టీడీపీ కార్యక్రమాలు




**మారేడుమిల్లి, మే 26(ప్రజా ప్రతిభ )**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ ఆదేశాల మేరకు, రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఛైర్‌పర్సన్ మిరియాల శిరీషదేవి భాస్కర్ సూచనలతో మారేడుమిల్లి మండలంలో మహానాడు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.మారేడుమిల్లి ఆదివాసి వర్తక కేంద్రం ప్రాంగణంలో ఈ నెల 27, 28 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హైబ్రిడ్ మోడ్ (వర్చువల్ విధానం)లో మహానాడు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు గురుకు శేషుకుమార్ తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పసుపు పండుగ 'మహానాడు'ను విజయవంతం చేసేందుకు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ సభ్యులు, యూనిట్, కో-యూనిట్ ఇన్‌చార్జులు, బూత్, కో-బూత్ ఇన్‌చార్జులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, కేఎస్ఎస్ సభ్యులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి విచ్చేసే నాయకులు, కార్యకర్తలందరికీ భోజన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# కిట్స్‌లో ఏఐ ల్యాబ్ ఆన్ వీల్స్..

## విద్యార్థులకు ఆధునిక సాంకేతికతలో ప్రత్యక్ష శిక్షణ..






**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందూరు శ్రీనివాసరెడ్డి, మే 26, (ప్రజా ప్రతిభ):**

సాంకేతిక రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడం అత్యంత అవసరమని మార్కాపురంలోని కృష్ణ చైతన్య సాంకేతిక విజ్ఞాన సంస్థ ప్రిన్సిపాల్ వి. కృష్ణారెడ్డి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా అందించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏఐ ల్యాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని మంగళవారం కిట్స్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు భవిష్యత్ ఉపాధి అవకాశాలకు దోహదపడే సాంకేతిక అంశాలపై విస్తృత స్థాయిలో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో విద్య కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు, యాంత్రిక నియంత్రణ వ్యవస్థలు, స్వయంచాలక సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు కూడా ఆ దిశగా తమ జ్ఞానాన్ని విస్తరించుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. భవిష్యత్తులో పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే సాంకేతిక నైపుణ్యాలే ప్రధాన ఆయుధమని స్పష్టం చేశారు.శిక్షణ విభాగాధిపతి మనోహర్ మాట్లాడుతూ, ఈ ప్రత్యేక మొబైల్ ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు కృత్రిమ మేధస్సు, యాంత్రిక నిర్మాణాల రూపకల్పన, వస్తువుల అనుసంధాన సాంకేతికత, విద్యుత్ ఆధారిత ప్రయోగాలు, పరస్పర క్రియాత్మక సంకేత రచన వంటి ఆధునిక అంశాలపై ప్రత్యక్ష శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి అంశాన్ని ప్రాయోగిక పద్ధతిలో వివరించడం ద్వారా విద్యార్థులు స్వయంగా పరిశీలించి అవగాహన పెంపొందించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు.విద్యార్థులు కేవలం సిద్ధాంత జ్ఞానంతో కాకుండా ప్రత్యక్ష అనుభవంతో నేర్చుకోవడం ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను సులభంగా అలవరుచుకుంటారని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై చిన్న వయస్సు నుంచే అవగాహన పెంపొందితే భవిష్యత్తులో పరిశోధనాత్మక దృక్పథం పెరుగుతుందని పేర్కొన్నారు.కార్యక్రమ సమన్వయకర్త రమణారెడ్డి మాట్లాడుతూ, సంస్థ స్థాయిలో మొత్తం వంద మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. వారిని నాలుగు బృందాలుగా విభజించి ఒక్కో బృందానికి 25 మంది చొప్పున శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ప్రతి బృందానికి తొంభై నిమిషాల పాటు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణలో పాల్గొనే విద్యార్థులకు ప్రత్యక్ష ప్రదర్శనలు, సాంకేతిక పరికరాల వినియోగంపై అవగాహన, అనుభవాధారిత శిక్షణ అందించనున్నట్లు వివరించారు.శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు పరిశ్రమ గుర్తింపు పొందిన డిజిటల్ ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ ధ్రువపత్రాలు భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల సాధనలో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందుతున్న కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడానికి విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.సంస్థ విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, సమస్యల పరిష్కార సామర్థ్యాలను పెంపొందించే దిశగా నిరంతరం వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు భవిష్యత్తు సాంకేతిక ప్రపంచానికి సిద్ధమయ్యే అవకాశం లభిస్తుందని, ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తన ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు.

# కంబాల శ్రీనివాసరావు సహకారంతో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వాటర్ ప్లాంట్ ఏర్పాటు

## తొలి విడతగా కంబాల లక్ష రూపాయలు విరాళం







**గోకవరం మే 26 (ప్రజా ప్రతిభ న్యూస్)**

తూర్పుగోదావరి జిల్లా, జగ్గంపేట నియోజకవర్గం, గోకవరం గ్రామంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రయాణికులు, ప్రజల సౌకర్యార్థంవిశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు సహకారంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారుఇటీవలే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రయాణికులు, ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించడం కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి సహకారం అందించాలని గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ గారు, సిబ్బంది, కార్మికులు కంబాల శ్రీనివాసరావు గారి వద్దకు వచ్చి కోరారుస్పందించిన ఆయన వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకారం అందిస్తానని, హామీ ఇచ్చారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు మొత్తం 3 లక్షలు రూపాయలు ఖర్చు అవుతుందని, ఆర్టీసీ మేనేజర్ , దానికి సంబంధించిన ఎస్టిమేషన్ ను కంబాల శ్రీనివాసరావు కి అందజేశారుదీనిలో భాగంగా కంబాల శ్రీనివాసరావు అమెరికాలో ఉన్నప్పటికీ వాటర్ ప్లాంట్ పనులను ప్రారంభించాలని మొదట విడతగా లక్ష రూపాయలు నగదు వారికి అందజేయాలని, రామసేన సభ్యులు, బీజేపీ నాయకులకు ఆదేశించారుఆయన ఆదేశాల మేరకు లక్ష రూపాయలు నగదును గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద ఆర్టీసీ డిపో మేనేజర్ సుచరిత కి రామసేన సభ్యులు, సిబ్బంది అందజేశారుఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు పెద్దాడ వెంకన్న దొర, సిబ్బంది పాల్గొన్నారు

# అభివృద్ధి కార్యక్రమాల అమలుపై మండల స్థాయి సమీక్ష

**మారేడుమిల్లి, మే 26(ప్రజా ప్రతిభ )**

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం మండల అధ్యక్షురాలు సార్ల లలితకుమారి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాల అమలు, పనితీరుపై సమీక్ష చేపట్టారు.వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చేతి పంపులు, పైప్‌లైన్‌ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నారాయణరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలో ఐదు రైతు సేవా కేంద్రాలు పనిచేస్తున్నాయని, "పొలం పిలుస్తోంది" కార్యక్రమం కొనసాగుతోందని వ్యవసాయ శాఖాధికారి కె. సత్యవేణి తెలిపారు. రైతులంతా ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు.మండలంలో 69 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, గుడిస గ్రామంలోని అంగన్‌వాడీ భవనం దెబ్బతినడంతో తాత్కాలికంగా అద్దె భవనంలో కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో రవళి తెలిపారు. సమస్యను పరిశీలించేందుకు తాను స్వయంగా గ్రామాన్ని సందర్శించినట్లు చెప్పారు.మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు నులిపురుగు నివారణ చర్యలు చేపట్టినట్లు పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ వీరేంద్ర తెలిపారు. పశు బీమా పథకం కింద పశువు మృతి చెందిన రైతులకు రూ.15 వేల వరకు, మేలుజాతి పశువులకు రూ.30 వేల వరకు ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. అలాగే క్యాటిల్ షెడ్ పథకం కింద రైతులకు 90 శాతం రాయితీ అందిస్తున్నట్లు వివరించారు.మారేడుమిల్లి మండలం ఏబీపీ పనితీరులో మొదటి స్థానంలో నిలవడంపై సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో జడ్పీటీసీ జి. బాలాజీబాబు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.




# స్వచ్ఛభారత్ కార్యక్రమాల పై శిక్షణ





**వాకాడు మే 26 ప్రజా ప్రతిభ**

తిరుపతి జిల్లావాకాడు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సౌజన్యమతో స్వచ్ఛభారత్ కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శిలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. మొదటగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి ఎంపీడీవో సాయి ప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాలపై ఎంపీడీవో శిక్షణ ఇవ్వడంతో పాటు అవగాహన కల్పించారు.

ప్రజా ప్రతిభ
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
AndhrapradeshDistricts
Praja Pratibha Telugu Daily
www.prajapratibha.in Prajapratibha.2013@gmail.com
బుధవారం
మే 27, 2026

## మోదకొండమ్మ, చిట్టి పైడితల్లమ్మ అమ్మవారిలను దర్శించుకున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్





**అచ్యుతాపురం ప్రజా ప్రతిభ మే 26:**

అచ్యుతాపురం మండలంలో ఎస్ ఈ జెడ్ లో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ అమ్మవారిని, దుప్పుతూరు గ్రామంలో వెలసిన చిట్టి పైడితల్లమ్మ అమ్మవారిని ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందర్పు విజయకుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ వెంట పలువురు కూటమినేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో అమ్మవారి ఆలయాలలో జరిగిన పూజ కార్యక్రమాలకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ ను గ్రామస్తులు యువకులు సాదరంగా ఆహ్వానించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచరణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బక్రీద్ పండుగ నేపథ్యంలో శాంతి కమిటీ సమావేశంనిర్వహించిన ఎస్ ఐ మారెప్ప



**పెద్దపంజాణి మే 26(ప్రజాప్రతిభ).**

పెద్దపంజాణి మండలంలోని రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకొని పెద్దపంజాణి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పండుగను ప్రశాంత వాతావరణంలో, సామరస్యపూర్వకంగా నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారంతో పండుగను జరుపుకోవాలని తెలిపారు. చట్టాలను పాటిస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. ఎలాంటి అపోహలు, వివాదాలకు తావు లేకుండా సామాజిక ఐక్యతను కాపాడాలని సూచించారు.
అలాగే ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో ముస్లిం పెద్దలు, స్థానిక ప్రముఖులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.ద

## అంగరంగ వైభవంగా శ్రీ సప్త శక్తి ఈశ్వరి అమ్మవారి జాతర



**కుప్పం, మే 26, (ప్రజా ప్రతిభ):**

కుప్పం పట్టణంలోని తపాల్ రాజ్ వీధిలో 13వ వార్షిక శ్రీ సప్త శక్తి ఈశ్వరి అమ్మవారి జాతర భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా ఉదయం గంగా పూజలు ఘనంగా నిర్వహించగా, గరగ అమ్మవారి అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారి వేషధారణలో భక్తులు పాల్గొని భక్తి పారవశ్యాన్ని చాటుకున్నారు. కేరళ వాద్యాలు, పంబ, పలక వాద్యాల నాదస్వరాల మధ్య అమ్మవారికి విశేష పూజలు నిర్వహించడంతో తపాల్ రాజ్ వీధి అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బాబి, శ్రీదేవి పీఠం నిర్వాహకులు, అలాగే శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవాలయం ప్రధాన అర్చకులు డాక్టర్ సోమశేఖర్ శాస్త్రి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర విజయవంతానికి స్థానిక యువకులు, భక్తులు మరియు నిర్వాహకులు విశేషంగా కృషి చేశారని నిర్వాహకర్త డాక్టర్ జి. విశ్వ తెలిపారు. ఈ కార్యక్రమం మొత్తం భక్తి, శ్రద్ధ, సంప్రదాయాల సమ్మేళనంగా కొనసాగింది.

# పాయకరావుపేటలో మే 27, 28న హైబ్రిడ్ మహానాడు

## పసుపు చొక్కాతో రావాలని కన్వీనర్ పిలుపు

**నక్కపల్లి, మే 26, (ప్రజా ప్రతిభ) :**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'హైబ్రిడ్ మహానాడు-2026' కార్యక్రమాలు ఈనెల 27, 28 తేదీల్లో పాయకరావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరగనున్నాయి.
నియోజకవర్గ పరిధిలోని పది ప్రాంతాల్లో క్లస్టర్ల వారీగా ఈ మహానాడు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, అభిమానులు ప్రతి ఒక్కరూ తమ క్లస్టర్ పరిధిలో జరిగే కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన హృదయపూర్వకంగా ఆహ్వానించారు.



**కార్యకర్తలకు కీలక సూచనలు:**

హాజరయ్యే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పసుపు రంగు చొక్కా ధరించి రావాలి. పార్టీ (ఐడీ కార్డు) వెంట తెచ్చుకొని ధరించాలి. కార్యక్రమానికి నిర్ణీత సమయానికి హాజరై సమయపాలన పాటించాలని ఆయన పేర్కొన్నారు.పార్టీ శ్రేణులంతా సమష్టిగా, క్రమశిక్షణతో పాల్గొని హైబ్రిడ్ మహానాడును ఘన విజయవంతం చేయాలని కన్వీనర్ వెంకటేష్ పిలుపునిచ్చారు. "జై తెలుగుదేశం" నినాదంతో ఆయన తన ప్రకటనను ముగించారు.

# పెద్దపంజాణి పోలీస్ స్టేషన్‌లో జి ఎమ్ ఎస్ కె ఎస్ సమావేశం

**పెద్దపంజాణి మే 26(ప్రజాప్రతిభ).**

పెద్దపంజాణి పోలీస్ స్టేషన్ పరిధిలోని జి ఎమ్ ఎస్ కె ఎస్ సభ్యులతో పోలీసులు ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ధైర్య స్పర్శ కార్యక్రమం, సచివాలయ పరిధిలో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలు, మహిళలపై నేరాలు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగ నివారణపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అక్రమ కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించి, నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో జి ఎమ్ ఎస్ కె ఎస్ సభ్యులు, సచివాలయ సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యం

## -కుప్పంలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మట్ ఆకస్మిక తనిఖీలు.







**కుప్పం, మే 26, (ప్రజా ప్రతిభ):**

కుప్పం ప్రాంత అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా కడ ప్రత్యేక దృష్టి సారిస్తోందని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. కుప్పం ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సేవలు, ప్రజలకు అందుతున్న సౌకర్యాల పై కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మట్ పలు ప్రాంతాల్లో ఆకస్మిక పర్యటనలు నిర్వహించారు.ఈ సందర్భంగా కుప్పం బస్టాండ్, కంచబందార్లపల్లె, రాళ్లబుదుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కర్లగట్ట సచివాలయం, పరమసముద్రంలోని అలీప్ పరిశ్రమ నిర్మాణ పనులను పరిశీలించారు. మొదటగా కుప్పం బస్టాండ్‌ను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి సందర్శించిన పిడి ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, పరిశుభ్రత, కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కంచబందార్లపల్లెలో కడ ప్రత్యేక తనిఖీ బృందం, సంబంధిత శాఖ అధికారులతో కలిసి భూగర్భ డ్రైనేజ్ పనులను పరిశీలించారు. ప్రజల సౌకర్యార్థం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడిన ఆయన, ప్రతి రోజు చెత్త సేకరణ ఆటో వస్తుందా, తాగునీటి సమస్యలేమైనా ఉన్నాయా, గ్రామంలో ఇతర ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ప్రజలు తెలిపిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాళ్లబుదుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ నిర్వహించిన పిడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.అనంతరం ఆసుపత్రి సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కర్లగట్ట సచివాలయాన్ని కడ ప్రత్యేక తనిఖీ బృందంతో కలిసి పరిశీలించిన ఆయన, ప్రజలకు సౌకర్యవంతమైన సేవలు అందేలా సచివాలయ పరిపాలన సమర్థవంతంగా కొనసాగాలని అధికారులకు సూచించారు. రికార్డుల నిర్వహణ, ప్రజా సేవల అమలు మరియు కార్యాలయ నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని తెలిపారు. చివరిగా పరమసముద్రంలో నిర్మాణంలో ఉన్న అలీప్ పరిశ్రమల పనులను పరిశీలించిన వికాస్ మర్మట్, నిర్ణయించిన గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేసి పరిశ్రమలను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు ఆదేశించారు.

# కుప్పంలో డిజిటల్ వేదికగా పసుపు పండుగ

## కుప్పంలో డిజిటల్ వేదికగా పసుపు పండుగ.

### --రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి.

**కుప్పం, మే 26, (ప్రజా ప్రతిభ):**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పసుపు పండుగ మహానాడు-2026 కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి నారా లోకేష్ సూచనల మేరకు కుప్పం నియోజకవర్గ పరిధిలోని 12 క్లస్టర్లలో నేడు, రేపు రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మహానాడు కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై మహానాడులో చర్చలు జరగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్థానిక నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని చెక్కునత్తం మణి పిలుపునిచ్చారు.మహానాడు విజయవంతానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు.



# నేటి నుండి వెంకటగిరిలో క్లస్టర్ స్థాయిలో ఘనంగా డిజిటల్ 'మహానాడు'...

## ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ...

## మహానాడు కార్యక్రమం విజయవంతం చేయాలనీ టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే సూచనలు...





**వెంకటగిరి, మే 26(ప్రజా ప్రతిభ ):**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా, పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్న 'మహానాడు-2026' కార్యక్రమాన్ని వెంకటగిరి నియోజకవర్గంలో ప్రతి క్లస్టర్ స్థాయిలో ఘనంగా విజయవంతం చేయాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు.మే 27, 28 తేదీలలో రెండు రోజుల పాటు డిజిటల్ వేదికగా జరగనున్న ఈ కార్యక్రమ సన్నాహకాలపై ఆయన అన్ని మండలాల పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమ ఏర్పాట్లలో భాగంగా ఆయన వెంకటగిరి పట్టణములోని పలు ఫంక్షన్ హాళ్లను నియోజకవర్గం పరిశీలకులు ఖాదీ మరియు గ్రామ పరిశ్రమల బోర్డు చైర్మన్ కె. కె చౌదరి తో కలిసీ సందర్శించి పరిశీలించారు. మహానాడు కార్యక్రమాన్ని కార్యకర్తలందరూ వీక్షించేందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్న భారీ ఎల్ఈడీ స్క్రీన్లు, వేదిక అలంకరణ, ఫ్లైవుడ్ కటౌట్లు మరియు ఇతర వసతులపై నాయకులతో చర్చించారు. బుధవారం, గురువారం రెండు రోజుల పాటు విచ్చేసే పార్టీ శ్రేణులు, కార్యకర్తల కోసం మధ్యాహ్నం బ్యాచ్‌ల వారీగా భోజన వసతులు మరియు స్నాక్స్ లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన నిర్వహణ (ఫుడ్ మెయింటెన్స్ ) ఉండాలని ఆయన నిర్వాహకులకు మరియు కమిటీ సభ్యులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ రెండు రోజులు జరిగే కార్యక్రమంలో ప్రతి ఒక్క టీడీపీ కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలనీ ఎ మ్మెల్యే కురుగొండ్ల తెలిపారు.

# రైతుల పాలిట రాక్షస ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

## పాటంశెట్టి సూర్యచంద్ర ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి



**గోకవరం మే 26 (ప్రజా ప్రతిభ న్యూస్)**

ఏలేరు నదిలో అక్రమంగా ఇసుక తోలడం వల్ల ఏలేరు లోతు అయ్యి కాలువలు మెరక అవడం వల్ల కాలువలకు నీరు వెళ్లకపోవడం వల్ల పంటలు ఎండిపోయి రైతులు ఎన్నో ఇబ్బందులు కష్టాలు పడటం జరుగుతుంది. గత ఎన్నో సంవత్సరాల నుండి ఏలేరులో ఇసుక తీయకూడదని రైతులందరూ మొరపెట్టుకుంటున్న సరే ఎవరు అధికారంలో ఉంటే వారు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు గత రెండు సంవత్సరాల నుండి జగ్గంపేట శాసనసభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూ గారు వారి కుమారుడు జ్యోతుల నవీన్ గారి ఆధ్వర్యంలో జగ్గంపేట నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయల ఇసుక, మట్టి ,గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతుందని అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఎమ్మెల్యే గారి అధికార బలం వల్ల అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈరోజు కిర్లంపూడి మండలం శృంగరాయునిపాలెం గ్రామంలో రైతులతో కలిసి ఏలేరులో 20 అడుగుల లోతుతో అక్రమంగా ఇసుక తీయడాన్ని అడ్డగించి లారీలను ప్రోక్లైనర్ లను పోలీసులకు హ్యాండోవర్ చేయడం జరిగిందని పాటంశెట్టి సూర్యచంద్ర తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వం కాదని రైతుల పాలిట రాక్షస ప్రభుత్వం అని పాటంశెట్టి సూర్యచంద్ర ఆరోపించారు. అవినీతి అక్రమాలను నిరూపిస్తుంటే మాపై



అక్రమంగా అన్యాయంగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయిస్తున్నారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గారు వారి కుమారుడు నవీన్ గారు మాపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా అవినీతి అక్రమాల పైన మరియు జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రజల పక్షాన పేదల పక్షాన తమ గళం ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటామని సూర్యచంద్ర స్పష్టం చేశారు-



# వానలు కురవాలి, పంటలు పండాలని గంగాలమ్మకు ప్రత్యేక పూజలు

**గూడెం కొత్తవీధి మే 26 ప్రజా ప్రతిభ**

సమయానికి వర్షాలు పడి పంటలు బాగా పండాలని గిరిజనులు గంగాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని దేరాలు గ్రామంలో మంగళవారం గంగమ్మ పండుగ నిర్వహించారు. ముందుగా గూడెం కాలనీలోని బోడ కొండమ్మ అమ్మవారికి గంగాభిషేకం చేశారు. అందరం దేరాల గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు . గిరిజనులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. గంగాలమ్మ కరుణించి వర్షాలు పడితే పంటలు బాగా పండుతాయని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేసారు . ఈ సందర్భంగా గిరిజనులు వేసిన థింసా నృత్యం ఆకట్టుకుంది. ఆటపాటలతో స్థానిక గిరిజనులు సందడిగా గడిపారు.





# వాకాడులో టిడిపి మహానాడుకు సన్నారెడ్డి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు



**వాకాడు మే 26 ప్రజాప్రతిభ**

తిరుపతి జిల్లా వాకాడు: రాష్ట్రవ్యాప్తంగా రేపు ప్రారంభమయ్యే టిడిపి మహానాడు హైబ్రిడ్ సమావేశాలకు వాకాడు లో ఆ మహానాడు కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు ఈ రోజే టిడిపి సీనియర్ నాయకుడు సన్నారెడ్డి విజయ్ శేఖర్ రెడ్డి మండల పరిధిలోని నాయకులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యక్రమం జరిగే వేదికను అందరితో కలిసి పరిశీలించి నాయకులందరి ద్వారా సూచనలు, సలహాలు స్వీకరించారు. ఉదయం నుండి సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి రేపు జరగబోవు మహానాడు వేదికగా ఎంపిక చేసిన షాది మంజల్ వద్ద విస్తృత ఏర్పాట్లు ను స్వయంగా పరిశీలిస్తున్నారు. కార్యక్రమాన్నికి వచ్చేవారికి అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నారు. మహానాడు కార్యక్రమం విజయవంతం అయ్యేవిధంగా సన్నారెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. విజయ శేఖర్ రెడ్డితో పాటు పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

# కాఫీ తోటల పెంపకంపై అవగాహన




**గూడెం కొత్తవీధి మే 26 ప్రజా ప్రతిభ**

కాఫీ తోటల పెంపకంపై గిరిజన రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జికె వీధి మండల ఉద్యాన అధికారిణి అరుణకుమారి తెలిపారు. రింతాడ పంచాయతీ కడుగుల గ్రామంలో మంగళవారం కాఫీ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. మొక్క నాటినప్పటి నుంచి ఫలసాయం వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. కాఫీ బోర్డు సిబ్బంది అధిక దిగుబడులపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారావు, శశిప్రియ, ప్రసాద్ పాల్గొన్నారు.

# కొత్తవలస పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న

## అరకులోయ మండల అధ్యక్షుడు స్వాబి రామ్మూర్తి.

**అరకులోయ, మే, 26 ( ప్రజా ప్రతిభ ):**

అరకులోయ మండలం,చొంపి పంచాయతీ పరిధిలోని కొత్తవలస గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ పండగ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామస్తుల ప్రత్యేక ఆహ్వానం మేరకు అరకులోయ మండల అధ్యక్షుడు రామ్మూర్తి ఈ ఉత్సవానికి విచ్చేశారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ?ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రామ్మూర్తి మాట్లాడుతూ... తనకు అమ్మవారిని దర్శించుకునే భాగ్యాన్ని, ఉత్సవంలో పాల్గొనే అవకాశాన్ని కల్పించిన కొత్తవలస గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఏడాది మండలంలో సకాలంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, రైతులందరూ సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ తల్లిని వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో రామ్మూర్తితో పాటు అరకులోయ మండల సూపర్ ఎంపీపీ నర్సింగరావు, పెద్దలబుడు ఎంపీటీసీ శత్రుఘ్న, మాదల ఎంపీటీసీ రామచంద్ర, చొంపి సూపర్ సర్పంచ్ దీనబంద్, సుంకరమెట్ట పంచాయతీ అధ్యక్షుడు అర్జున్, ప్రముఖ కాంట్రాక్టర్ అప్పల రాము, సుంక్ర మరియు స్థానిక గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.





## కొంటె చూపులతో హీట్ పెంచుతున్న శ్రీలీల..!

**టాకిస్:** టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యువ కథానాయిక శ్రీలీల మరోసారి తన అందం, అభినయంతో పాటు స్టైలిష్ లుక్‌తోనూ వార్తల్లో నిలిచింది. వరుస విజయాలతో అగ్ర కథానాయికల సరసన చేరిన ఈ అందాల భామ, తాజాగా విడుదల చేసిన ఫొటోలతో సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది.

రంగురంగుల దుస్తుల్లో మెరిసిపోయిన శ్రీలీల, తన చిలిపి హావభావాలు, కొంటె చూపులతో అభిమానులను ఆకట్టుకుంటోంది. సాధారణ మేకప్‌తోనే సహజసిద్ధమైన అందాన్ని చాటుకున్న ఆమె, ప్రతి ఫొటోలోనూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా ఆమె చిరునవ్వు, కళ్లలోని చలాకీతనం ఫొటోలకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి.

నటన, నృత్యం, అందం.. ఇలా ప్రతి అంశంలోనూ తనదైన ముద్ర వేస్తున్న శ్రీలీలకు యువతలో విశేష ఆదరణ ఉంది. వెండితెరపై తన ఉత్సాహభరితమైన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆమె, సోషల్ మీడియాలోనూ అదే స్థాయిలో అభిమానులను ఆకర్షిస్తోంది.

తాజా ఫొటోషూట్‌లో గ్లామర్‌కు హుందాతనాన్ని జోడించిన శ్రీలీల, మరోసారి తన ఫ్యాషన్ అభిరుచిని చాటుకుంది. అతిగా ఆర్భాటం లేకుండానే ఆకట్టుకునేలా కనిపించడం ఆమె ప్రత్యేకతగా చెప్పవచ్చు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారగా, అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

“అందం.. అభినయం.. అల్లరి చూపులు.. శ్రీలీల అంటే ఇదే!” అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## చూపుతిప్పుకోనివ్వని చందమామ

### - గోల్డెన్ శారీలో దేవకన్యలా దర్శనమిచ్చిన రుక్మిణి

టాకిస్: కన్నడ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్న నటి రుక్మిణి వసంత్ మరోసారి తన అందం, అభినయంతో పాటు ఫ్యాషన్ సెన్స్‌తోనూ వార్తల్లో నిలిచింది. ‘సప్త సాగరదాచే ఎల్లో’ చిత్రంతో విశేష గుర్తింపు పొందిన ఈ భామ, తాజాగా సంప్రదాయం–ఆధునికత కలబోసిన వస్త్రధారణలో కనిపించి అభిమానులను ఆకట్టుకుంటోంది.

ఇటీవల నిర్వహించిన ఓ అవార్డుల వేడుకలో షాంపేన్ గోల్డ్ రంగు నెట్ చీరలో రుక్మిణి వసంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చీరపై ఉన్న సీక్విన్స్, ముత్యాల అలంకరణ ఆమె రూపానికి మరింత శోభను తీసుకొచ్చాయి. దీనికి తగినట్లుగా ధరించిన బ్లౌజ్, సాదాసీదా ఆభరణాలు, వెనక్కి ముడివేసిన జుట్టుతో ఆమె రాజకుమార్తెలా కనిపించింది.

అంతేకాకుండా తాజాగా నిర్వహించిన మరో ఫొటోషూట్‌లో హెవీ ఎంబ్రాయిడరీతో కూడిన లెహంగాలో రుక్మిణి మెరిసిపోయింది. మెడలో డైమండ్ హారం, చేతులపై మెరిసే నెట్ స్లీవ్స్‌తో ఆమె ఇచ్చిన భంగిమలు అభిమానులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ముఖ్యంగా ఆమె ముఖంలోని చిరునవ్వు, ఆత్మవిశ్వాసం ఫొటోషూట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. రుక్మిణి అందం, హుందాతనం, ఫ్యాషన్ ఎంపికలపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ప్రతి కొత్త ఫొటోషూట్‌తో తన ప్రత్యేకతను చాటుకుంటున్న ఈ కన్నడ భామ, సోషల్ మీడియాలో మరోసారి చర్చనీయాంశంగా మారింది.



## ‘పెద్ది’ ప్రమోషన్స్‌లో జాన్వీ అందాల జాతర

- బెనారసీ వస్త్రకళకు ఆధునిక హంగులు జోడించిన ప్రత్యేక గౌను
- పాస్టెల్ రంగులు, పూల డిజైన్లతో ఆకట్టుకున్న జాన్వీ
- ఫ్యాషన్ ప్రియుల ప్రశంసలు అందుకుంటున్న నటి

**టాకీస్:** బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ మరోసారి తన ప్రత్యేకమైన ఫ్యాషన్ ఎంపికతో అందరి దృష్టిని ఆకర్షించారు. ‘పెద్ది’ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా బెంగళూరులో ఆమె ధరించిన ప్రత్యేక గౌను ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సంప్రదాయ బెనారసీ వస్త్రకళకు ఆధునిక హంగులు జోడించి రూపొందించిన ఈ దుస్తుల్లో జాన్వీ అచ్చం దేశీ యువరాణిలా మెరిసిపోయారు.

సాధారణంగా బెనారసీ వస్త్రం అంటే చీర గుర్తుకు వస్తుంది. అయితే జాన్వీ సంప్రదాయానికి భిన్నంగా భుజాలు కనిపించే విధంగా రూపొందించిన ప్రత్యేక గౌనును ధరించి ఆకట్టుకున్నారు. శరీరాకృతికి తగ్గట్టుగా రూపొందించిన ఈ దుస్తులు ఆమె అందాన్ని మరింత ఇనుమడింపజేశాయి. లేత గులాబీ, మింట్, ఐవరీ రంగుల కలయికతో పాటు బంగారు వర్ణంలో అల్లిన పూల నమూనాలు ఈ గౌనుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

దీనికి అనుగుణంగా లేత రంగుల పలుచని దుపట్టాను జతచేయడంతో ఆమె రూపానికి రాజసపు నిగారింపు వచ్చింది. వెండి జుంకాలు, చెవికి ప్రత్యేక అలంకరణలు వంటి సాధారణ ఆభరణాలను మాత్రమే ఉపయోగించి తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జుట్టును ముడివేసి, మెరిసే మేకప్‌తో తన అందాన్ని మరింత హైలైట్ చేశారు.

ఇటీవల ఊదా రంగు లెహంగాలో అభిమానులను అలరించిన జాన్వీ, ఇప్పుడు ఈ ప్రత్యేక బెనారసీ గౌనుతో మరోసారి ఫ్యాషన్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారారు. సంప్రదాయ భారతీయ వస్త్రకళకు ఆధునికతను జోడిస్తూ కొత్త తరానికి నచ్చే శైలిని ఆమె ప్రదర్శించారని ఫ్యాషన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



దేశీ యువరాణిలా మెరిసిన బాలీవుడ్ భామ



### పసిడి, వెండి ధరల పతనం..

## ఒక్కరోజే రూ.5,000 తగ్గిన వెండి

- ఇరాన్‌పై అమెరికా దాడులతో పతనమైన బంగారం, వెండి
- ఎంసీఎక్స్‌లో రూ.971 తగ్గిన బంగారం
- సుమారు రూ.5,000 పతనమైన వెండి
- భౌగోళిక ఉద్రిక్తతల కారణంగానే బులియన్ మార్కెట్లో ధరలు ప్రభావితం

**ముంబై:** మంగళవారం బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. ఇరాన్‌పై అమెరికా సైన్యం దాడులు జరపడంతో సురక్షిత పెట్టుబడులుగా భావించే ఈ లోహాలపై అమ్మకాల ఒత్తిడి పెరిగింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో బంగారం ఫ్యూచర్స్ సుమారు రూ.1,000 వరకు పడిపోగా, వెండి ఫ్యూచర్స్‌లో దాదాపు 2 శాతం మేర క్షీణత కనిపించింది.

వివరాల్లోకి వెళితే.. మంగళవారం ఉదయం 10:25 గంటల సమయంలో ఎంసీఎక్స్‌లో జూన్ 5 గోల్డ్ ఫ్యూచర్స్ 0.61% నష్టంతో రూ.971 తగ్గి రూ.1,58,110 వద్ద ట్రేడ్ అయింది. ఇంట్రాడేలో రూ.1,58,000 కనిష్ఠ స్థాయిని తాకింది. మరోవైపు జులై 3 సిల్వర్ ఫ్యూచర్స్ కూడా అమ్మకాల ఒత్తిడికి గురైంది. ఇంట్రాడేలో సుమారు 2% నష్టపోయి, రూ.5,000 కంటే ఎక్కువగా పతనమై రూ.2,71,972 కనిష్ఠాన్ని నమోదు చేసింది.

దక్షిణ ఇరాన్‌లోని క్షిపణి ప్రదేశాలు, పడవలపై అమెరికా సైన్యం దాడులు జరపడమే ఈ పతనానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇరాన్ చర్చల కోసం తమ ప్రతినిధులను దోహాకు పంపిన సమయంలోనే ఈ దాడులు జరగడం గమనార్హం. దీనిని అమెరికా ‘ఆత్మరక్షణ’ చర్యగా పేర్కొంది. ఈ భౌగోళిక ఉద్రిక్తతల కారణంగానే బులియన్ మార్కెట్లో ధరలు ప్రభావితమయ్యాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# రఫ్ఫాడించిన రజత్

- ఫైనల్లో బెంగళూరు
- 92 రన్స్‌తో గుజరాత్ చిత్తు

**ధర్మశాల:** డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఆల్‌రౌండ్‌షోతో అదరగొట్టింది. కెప్టెన్ రజత్ పటీదార్ (33 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సర్లతో 93 నాటౌట్) విధ్వంసకర ఇన్నింగ్స్‌కు బౌలర్ల దూకుడు తోడవడంతో వరుసగా రెండోసారి ఫైనల్‌కు చేరింది. మంగళవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఏకపక్ష పోరులో ఆర్‌సీబీ 92 పరుగులతో భారీ విజయాన్నందుకుంది. ఇక చెత్త బ్యాటింగ్‌తో మూల్యం చెల్లించుకున్న టైటాన్స్ ఈనెల 29న క్వాలిఫయర్ 2లో మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 254 పరుగులు చేసింది. క్రునాల్ పాండ్యా (28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 43), విరాట్ (25 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 43), దేవ్‌దత్ (19 బంతుల్లో 5 ఫోర్లతో 30) వేగం చూపారు. హోల్డర్, రబాడలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 19.3 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌటైంది. తెవాటియా (43 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 68), బట్లర్ (11 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 29) మాత్రమే రాణించగా, ఎనిమిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. డఫీకి 3.. క్రునాల్, రసిఖ్, భువనేశ్వర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా రజత్ నిలిచాడు.

**పోరాటమే లేకుండా...:** ఆర్‌సీబీ బ్యాటర్లకు అద్భుతంగా సహకరించిన పిచ్.. గుజరాత్ ఇన్నింగ్స్‌లో మాత్రం దెబ్బకొట్టింది. బౌలర్లు టపటపా వికెట్లు తీయగా.. ఒక్కో పరుగు కోసం చెమటోడ్చింది. దీంతో 255 పరుగుల కష్టసాధ్యమైన ఛేదనలో గుజరాత్ పవర్‌ప్లేలోనే సగం జట్టును కోల్పోవడం గమనార్హం. చివర్లో తెవాటియా బ్యాట్ ఝుళిపించినా.. అప్పటికే జట్టు ఓటమి ఖరారైంది. అత్యంత విజయవంతమైన ఓపెనింగ్ జోడీగా పేరు తెచ్చుకున్న సాయి సుదర్శన్–గిల్ (2) తొలి మూడు ఓవర్లలోనే పెవిలియన్‌కు చేరారు. బట్లర్ బౌండరీలతో ఆకట్టుకున్నా అతడి ఆట 11 బంతులకే పరిమితమైంది. నిశాంత్ (5), హోల్డర్ (0)ను ఆరో ఓవర్లో పేసర్



రసిఖ్ అవుట్ చేయడంతో పవర్‌ప్లేలో 51/5 స్కోరుతో టైటాన్స్‌కు పరిస్థితేమిటో అర్థమైంది. లోయర్ మిడిలార్డర్‌తో పాటు టెయిలెండర్లు కూడా ఇలా వచ్చి అలా వెళ్లడంతో గుజరాత్ 88 పరుగులకే 8 వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో తెవాటియా ఎడాపెడా బౌండరీలతో స్కోరులో కదలిక తెచ్చాడు. 33 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన తెవాటియా ఆటతో గెలుపు అసాధ్యమైనా.. ఓటమి అంతరాన్ని మాత్రం తగ్గించగలిగింది. 19వ ఓవర్లో భువీ అతడిని అవుట్ చేయగా.. తొమ్మిదో వికెట్‌కు సిరాజ్ (5)తో కలిసి 68 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

**రజత్ ఎదురుదాడి:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ తొలి ఓవర్ నుంచే చెలరేగింది. బరిలోకి దిగిన ప్రతీ బ్యాటర్ వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. ఇక కెప్టెన్ రజత్ పటీదార్ డెత్ ఓవర్లలో సాగించిన విధ్వంసానికి జట్టు 250 దాటేసింది. అతడికి క్రునాల్ పాండ్యా సహకరించాడు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 47 బంతుల్లోనే 95 పరుగుల భాగస్వామ్యం అందించింది. దీనికితోడు గుజరాత్ పేలవ



ఫీల్డింగ్ కలిసివచ్చింది. ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ (19) మూడు ఫోర్లతో మ్యాచ్‌ను ఆరంభించాడు. రబాడ ఓవర్‌లోనూ సిక్సర్ బాదిన తను అదే ఓవర్లో వెనుదిరిగాడు. ఆ తర్వాత దేవ్‌దత్ బ్యాట్ ఝుళిపిస్తూ.. నాలుగో ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగాడు. అటు ఓపెనర్ విరాట్ ఆరో ఓవర్లో 4,4,6తో అండగా నిలవడంతో పవర్‌ప్లేలో జట్టు 76/1తో నిలిచింది. ఆ తర్వాత 7 నుంచి 10 ఓవర్ల మధ్య పరుగుల వేగం తగ్గింది. పేసర్ హోల్డర్, స్పిన్నర్ రషీద్ పరుగులను కట్టడి చేశారు. తొమ్మిదో ఓవర్లో విరాట్, దేవ్‌దత్‌లను హోల్డర్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

ఈ దశలో రజత్, క్రునాల్ జోడీ జట్టును ఆదుకుంది. క్రీజులో కుదురుకున్నాక ఇద్దరూ చెలరేగడంతో పరుగులు ధారాళంగా వచ్చాయి. 14వ ఓవర్లో రజత్ 20 రన్స్ వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను రబాడ వదిలేయడం మలుపు తిప్పింది. అనంతరం జీటీ బౌలర్లకు చుక్కలే కనిపించాయి. 15వ ఓవర్లో క్రునాల్ 4,4 రజత్ 4,6,4తో ఏకంగా 28 పరుగులు రాగా, తర్వాత రషీద్ ఓవర్‌లోనూ రజత్ 6,6 క్రునాల్ 6తో 21 రన్స్ సమకూరాయి. 17వ ఓవర్లో క్రునాల్‌ను రబాడ అవుట్ చేసినా పటీదార్ రెండు సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. టిమ్ డేవిడ్ (4) నిరాశపర్చగా, 19వ ఓవర్లో పటీదార్ 6,4 జితేశ్ (15 నాటౌట్) 4,6తో 21 రన్స్.. ఆఖరి ఓవర్లో రజత్ రెండు సిక్సర్లతో 19 రన్స్ రాబట్టడంతో ఆర్‌సీబీ అత్యంత పటిష్ఠ స్థితిలో నిలిచింది.

## అమీతుమీ

- నేడు ఎలిమినేటర్
- రైజర్స్ x రాయల్స్
- రాత్రి 7.30 నుంచి
- ఓడిన జట్టు ఇంటికే

**ముల్లన్‌పూర్:** అత్యంత పటిష్ఠమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన సన్‌రైజర్స్ ఓ వైపు.. 15 ఏళ్ల చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీపై అతిగా ఆధారపడిన రాజస్థాన్ రాయల్స్ మరో వైపున బుధవారం జరిగే ఎలిమినేటర్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇందులో గెలిచిన జట్టుకు ఫైనల్‌కు చేరేందుకు క్వాలిఫయర్ 2 రూపంలో మరో అవకాశం లభిస్తుంది. ఓడిన జట్టు లీగ్ నుంచి నిష్క్రమించాల్సిందే. ఇప్పటికే ఈ సీజన్‌లో రాజస్థాన్‌ను రెండుసార్లు ఓడించిన రైజర్స్ ఆత్మ విశ్వాసంతో ఉంది. టాపార్డర్‌లో అభిషేక్, హెడ్, ఇషాన్‌లతో పాటు మిడిలార్డర్‌లో క్లాసెన్, నితీశ్, అనికేత్‌లతో బ్యాటింగ్ విభాగం దుర్భేద్యంగా కనిపిస్తోంది. అలాగే కెప్టెన్ ప్యాట్ కమిన్స్ రాకతో బౌలింగ్ మరింత బలంగా మారింది. ఎషాన్ మలింగ, సకీబ్, ప్రఫుల్ అతడికి సహకరిస్తున్నారు. స్పిన్నర్ హర్ష్ దూబే కీలకం కానున్నాడు. అటు ఓపెనర్ వైభవ్ హిట్టింగ్‌పై రాయల్స్ ఆశలు పెట్టుకుంది.


Printed published and own by him Dr. kongarapu Ganapathi, D.No 1/164 Balanki street, paalakonda-532440.
Officeaddress D-NO: 8-33-13, Near Kalabarathi opp com office, pithapuram colony, Maddilapalem visakhapatnam-530003. RNI:APTEL 2013/54721.
Editor in Chief: Danuri Srinivas - 9441500341